

వీరే ఆ టెర్రరిస్టులు

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్

Cell:9701249103

సంపుటి - 2 సంచిక -51 గురువారం 24 ఏప్రిల్ 2025 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -8 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# పాక్ కుట్రే..!

## పాకిస్థాన్‌తో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేసిన భారత ప్రభుత్వం





**ఉగ్రదాడి వెనుక బయటి శక్తుల ప్రమేయంపై ఆధారాలు లభ్యం**

**భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ నిర్ణయం**

**భారత్ లోని పాక్ టూరిస్టులు, పౌరులు వెంటనే వెళ్లిపోవాలని ఆదేశం**

**వాఘా-అటారీ చెక్ పోస్ట్ నిలిపివేత**

న్యూఢిల్లీ/**ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది ప్రాణాలను బలిగొన్న ఉగ్రదాడి ఘటనలో "బాహ్య శక్తుల హస్తం" ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడి కావడంతో, భారత ప్రభుత్వం పాకిస్థాన్‌పై పలు కఠినమైన నిర్ణయాలు తీసుకుంది. దేశ భద్రతకు సంబంధించిన అత్యున్నత నిర్ణయాధికార సంస్థ అయిన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఈ మేరకు కీలక చర్యలకు ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా దశాబ్దాల నాటి సింధు నదీ జలాల ఒప్పందాన్ని నిరవధికంగా నిలిపివేయడం, అటారీ-వాఘా సరిహద్దును తక్షణమే మూసివేయడం వంటి ప్రధాన నిర్ణయాలున్నాయి.భారత్ తీసుకున్న అత్యంత కీలకమైన చర్యల్లో 1960 నాటి సింధు నదీ జలాల ఒప్పందాన్ని తక్షణమే నిరవధికంగా నిలిపివేయడం ఒకటి. ఈ ఒప్పందం ప్రకారం సింధు, దాని ఉపనదులైన జీలం, చీనాబ్, రావి, బియాస్, సట్లెజ్ నదుల జలాలను ఇరు దేశాలు పంచుకుంటున్నాయి. పాకిస్థాన్‌లోని కోట్ల మంది ప్రజలకు ఈ నదులే ప్రధాన నీటి వనరు. మిగతాది 2లో...

## ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ

**ఉగ్రదాడిలో తెలుగు వ్యక్తులు మృతి :సంతాపం తెలిపిన సీఎం చంద్రబాబు**



**ఫహల్గామ్ ఉగ్రదాడిలో ఇద్దరు తెలుగు వ్యక్తుల మృతి**

**తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు**

**ఉగ్రవాదం ద్వారా ఇప్పటివరకు ఎలాంటి లక్ష్యాలు నెరవేరలేదని స్పష్టీకరణ**

అమరావతి**ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో చెందిన ఇద్దరు తెలుగు వ్యక్తులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జె.ఎస్. చంద్రమౌళి, మధుసూదన్ కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు.ఈ విషాద ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉగ్రవాదుల దాడిలో తెలుగు సమాజానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు.

మిగతాది 2లో...

## ఎన్నికల కేసు కొట్టివేతకు రేవంత్ పిటిషన్

హైదరాబాద్**ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గతేడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై భాజపా నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. భాజపాకు పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు.. మిగతాది 2లో...



## ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

**ఫలితాలు విడుదల చేసిన మంత్రి లోకేశ్**

**81.14 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత**

**1,680 పాఠశాలలు 100 శాతంఫలితాలు**

**93.90 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో పార్వతీపురం మన్యం జిల్లా**

అమరావతి,**ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ఆంధ్రప్రదేశ్‌లో పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ టెన్త్ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 6,14,459 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 4,98,585 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 81.14 శాతం మంది విద్యార్థులుమిగతాది 2లో...



వందశాతం మార్కులు సాధించిన నేహాంజని

## కొత్త లోగోను ఆవిష్కరించిన హైడ్రా

హైదరాబాద్,**ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** నగరంలోని ప్రభుత్వ స్థలాలు, చెరువుల పరిరక్షణకు కృషి చేస్తున్న హైడ్రా.. ఇకపై కొత్త లోగోతో తన కార్యకలాపాలను కొనసాగించనుంది. ఇన్నాళ్లు ఈవీడీఎం లోగోతోనే ప్రజల్లోకి వచ్చిన హైడ్రా.. తాజాగా లోగోను మార్చింది. హైదరాబాద్ నగరాన్ని సూచిస్తూ హెచ్(ఐ) అక్షరంపై నీటి బొట్టు ఉన్న లోగోను రూపొందించింది. జల సంరక్షణ చేపడుతూనే నగరాన్ని విపత్తుల నుంచి రక్షించుకుందామని సూచిస్తూ కొత్త లోగోను తీర్చిదిద్దారు. ఈ లోగోను అధికారికంగా ఆమోదించిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.. హైడ్రా కార్యాలయంతోపాటు- సిబ్బంది యూనిఫాం, వాహనాలపై కొత్త లోగోను ముద్రించాలని సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది హైడ్రా అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో కొత్త లోగోను అప్‌డేట్ చేసింది.

## ప్రశాంతంగా ఎంఎల్‌సి పోలింగ్



2లో.



## ప్రజల గొంతుక బిఆర్ఎస్

- ఉద్యమమైనా..పాలననైనా, ప్రతిపక్షమైనాఒక్క గులాబీకే సాధ్యం
- రజతోత్సవ సభరాజకీయ లబ్ధి కోసం కాదు
- పార్టీఆవిర్భవించి 25ఏళ్లు పూర్తవుతున్న
- మహోన్నత నేపథ్యంలో జరుగుతున్న సభ
- పల్లె పల్లె కదిలి రావాలి..సభ చరిత్రలోనిలిచిపోవాలి
- 10లక్షల మందికి అన్నిఏర్పాట్లు చేశాం
- సభ ఏర్పాట్ల పరిశీలనఅనంతరం బిఆర్ఎస్ పార్టీ అగ్రనేత కెటిఆర్



2లో.

## బాధిత కుటుంబాలకు ఓదార్పు అండగా ఉంటామన్న అమిత్ షా



2లో.

## కృష్ణా జలాల పునఃపంపిణీపై.. కేంద్ర గెజిట్‌ను రద్దు చేయండి

**ట్రైబ్యునల్‌కు అదనంగా ఇచ్చిన టీవోఆర్ చెల్లదు**

**సుప్రీంకోర్టులో ఆంధ్రప్రదేశ్ వాదనలు**

**విభజన చట్టం ప్రకారం ఇప్పటికే కేటాయింపులు**

**వాటిని మళ్లీ పరిశీలించాలనడం తగదు**

**అంతర్రాష్ట్ర చట్టం సెక్షన్-3తో మాకు అన్యాయం: ఏపీ**



2లో.

అనుక్షణం ప్రజల పక్షం RNI NO: TELTEL/2023/87607
జర్నలిస్ట్ వార్త
తెలుగు దిన పత్రిక





# బాధిత కుటుంబాలకు ఓదార్పు అండగా ఉంటామన్న అమిత్ షా

**శ్రీనగంఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**
పహల్గామ్ బాధిత కుటుంబాలతో శ్రీనగర్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా భేటీ అయ్యారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకముందు పహల్గామ్ మృతుల భౌతికకాయాలకు అమిత్ షా నివాళులర్పించారు. అమిత్ షా.. పహల్గామ్ సంఘటనాస్థలిలో పర్యటించారు. అమిత్ షా వెంట జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఉన్నారు. ఇక భద్రతా దళాలు ఆ ప్రాంతాలను తమ స్వాధీనంలోకి తీసుకున్నారు. అంతేకాకుండా ఉగ్రవాదుల కోసం జల్లెడ పడుతున్నారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో దాదాపు 8-10 మంది ఉగ్రవాదులు పాల్గొన్నట్లుగా గుర్తించారు. వీరిలో 5-7 మంది ఉగ్రవాదులు పాకిస్తాన్‌కు చెందినవారని అనుమానిస్తున్నట్లు- సమాచారం. దాడి చేసింది తామేనని ది రెసిస్టెన్స్ ఫ్రంట్(టీ-ఆర్ఎఫ్) ప్రకటించింది. ఈ ఉగ్రవాదులంతా కేవలం పురుషులను మాత్రమే టార్గెట్ చేసుకున్నారు. మహిళలు, పిల్లల్ని ఏమి చేయలేదు. వారి జోలికి కూడా రాలేదు. ఒకవేళ అడ్డొచ్చినా.. ఏమీ చేయలేదు. ఇక ముస్లిమా? కాదా? అని వివరాలు అడిగి తెలుసుకున్నాకే కాల్చారు. ఐడీ కార్డులో పేరు చూసి మరీ కాల్చేశారని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. పర్యాటక కేంద్రమైన పహల్గామ్‌లో మంగళవారం మధ్యాహ్నం జరిగిన కాల్పుల్లో ఇద్దరు విదేశీయులు సహా 28 మంది మరణించారు. యూఏఈ, నేపాల్‌కు చెందిన ఇద్దరు విదేశీయులు ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇక ఈ ఉగ్ర



దాడిని ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. భారత్‌కు అండగా ఉంటామని అమెరికా, రష్యా, ఇజ్రాయెల్ ప్రకటించాయి. ఇక సౌదీ అరేబియా పర్యటనలో ఉన్న ప్రధాని మోడీ.. ఉగ్ర దాడి వార్త తెలుసుకున్న వెంటనే హుటాహుటినా భారత్‌కు బయల్దేరి వచ్చేశారు. బుధవారం అత్యవసర కేబినెట్ సమావేశానికి పిలుపునిచ్చారు. భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నారు.

# ఎపి టెన్త్ ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)
ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లా 93.90 శాతం ఉత్తీర్ణతతో తొలి స్థానంలో ఉందని అన్నారు. 1,680 పాఠశాలలు 100 శాతంఫలితాలు సాధించాయని ఆయన ప్రశంసించారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ మంత్రి లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. విజయం సాధించని విద్యార్థులు నిరుత్సాహపడవద్దని, జీవితంలో రెండో అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 19 నుంచి 28 వరకు జరుగుతాయని, విజయం సాధించడానికి మరొక అవకాశాన్ని అందిస్తున్నామని లోకేష్ వివరించారు. ఫలితాల్లో 93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. బాలికల్లో 84.09 శాతం, బాలురలో 78.31 శాతం పాసయ్యారు. 1,680 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. మే 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇకపోతే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్ సొసైటీ- నిర్వహించిన పది, ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. పదోతరగతి రెగ్యులర్ పబ్లిక్ పరీక్షల ఫలితాలతో పాటు వీటిని కూడా మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఓపెన్ ఎస్.ఎస్.సి పరీక్షలు 26,679 మంది రాయగా, ఇంటర్ పరీక్షలకు 63,668 మంది విద్యార్థులు హాజరయ్యారు. పదిలో 37.93 శాతం, ఇంటర్ లో 53.12 శాతంఉత్తీర్ణత నమోదు అయినట్లు అధికారులు వెల్లడించారు. విద్యార్థులు తమ అడ్మిషన్ నెంబర్ లేదా రోల్ నంబర్ ఎంటర్ చేసి ఫలితాలు పొందొచ్చు.రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోసం ఏప్రిల్ 26 నుంచి మే 5 వరకు విద్యార్థులు ఏదైనా ఏపీ ఆ÷-లనైన్ కేంద్రంలో రుసుం చెల్లించవచ్చని అధికారులు సూచించారు. ఒక్కో సబ్జెక్టు రీ- కౌంటింగ్ కోసం రూ.200, జవాబు పత్రాల రీ-వెరిఫికేషన్ కోసం రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

# కృష్ణా జలాల పునఃపంపిణీపై.. కేంద్ర గెజిట్‌ను రద్దు చేయండి

**న్యూఢిల్లీ/ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**
తెలుగు రాష్ట్రాల మధ్య నీటి పంపకానికి బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు కేంద్రం జారీ చేసిన నూతన అదనపు మార్గదర్శకాలు (టెర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్-టీవోఆర్) సరికాదని ఆంధ్రప్రదేశ్ తెలిపింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్-3 ప్రకారం కృష్ణా జలాల పంపిణీ చేపడితే తనకు తీరని నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తంచేసింది. సదరు టీవోఆర్‌ను రద్దు చేయాలని సుప్రీంకోర్టును కోరింది. నదీ పరివాహక ప్రాంతం, ప్రస్తుత నీటివాడకం లెక్కల ఆధారంగానే గతంలో నీటి కేటాయింపులు చేశారని, ఇప్పుడు పునఃపంపకాల కోసం ట్రైబ్యునల్‌కు విధివిధానాలు ఖరారు చేయడం వల్ల తమకు అన్యాయం జరుగుతుందని తెలిపింది. ఈ మేరకు ఏపీ దాఖలుచేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఆంధ్ర తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపించారు. కేంద్ర నిర్ణయం ఆమోదయోగ్యం కాదని, నదీ జలవివాద చట్టం ప్రకారం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్‌కు ఇలా అదనపు అంశాలు పరిశీలించే అధికారం లేదని తెలిపారు. విభజన చట్టం ప్రకారం నీటి కేటాయింపులకు రక్షణ ఉందని, ఇప్పటికే సెక్షన్ 89ఏ, బీ కింద ట్రైబ్యునల్ తెలుగు రాష్ట్రాల మధ్య నీటిని ప్రాజెక్టుల వారీ కేటాయింపులపై పరిశీలిస్తుండగా.. కొత్త నియమ నిబంధనలు చేర్చడం తగదన్నారు. %ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర మధ్య కృష్ణా జలాల పంపిణీలో భాగంగా ఉమ్మడి రాష్ట్రానికి గతంలో 811 టీఎంసీలు కేటాయించారని గుర్తుచేశారు. విభజన తర్వాత ఏపీకి 512, తెలంగాణకు 299 టీఎంసీలు కేటాయించారని.. వెల్లడించారు. ఇప్పుడు వీటిని మళ్లీ మొదటి నుంచి పరిశీలించేలా విధివిధానాల ఖరారు తగదని, దీనివల్ల ఏపీకి తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర విభజన చట్టాన్ని పార్లమెంటు ఆమోదించిందని.. దీనిని సవరించే అధికారం, హక్కు కేంద్రానికి లేవన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీలకు బచావత్ ట్రైబ్యునల్ 2013లోనే ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు జరుపుతూ తీర్పు ఇచ్చినా.. న్యాయపరమైన వివాదాల కారణంగా అమల్లోకి రాలేదని.. ఈ తరుణంలో రెండు తెలుగు రాష్ట్రాల నడుమ నీటి పంపకాలపై రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89కు భిన్నంగా కేంద్రం ఏకపక్షంగా కొత్త టీవోఆర్ విడుదల చేసిందని తెలిపారు. కోర్టు సమయం ముగియడంతో తదుపరి వాదనలు గురువారం వింటామని.. సమయం సరిపోదనుకుంటే ఇంకో రోజు కూడా వింటామని ధర్మాసనం స్పష్టం చేసింది. గురువారం సమగ్ర సమాచారం ఇస్తామని గుప్తా తెలిపారు.

**పూర్వాపరాలివీ..:**
రాష్ట్ర విభజన జరిగాక కృష్ణా జలాల పంపకాలపై కొత్త ట్రైబ్యునల్ వేయాలని తెలంగాణ సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. 2023లో 2 రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ ఢిల్లీలో అప్పటి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసినప్పుడు కూడా.. కొత్త ట్రైబ్యునల్ వేయాలని తెలంగాణ కోరింది. అయితే సుప్రీంకోర్టులో కేసును ఉపసంహరించుకోవాలని షెకావత్ సూచించడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం కేసు వాపస్ తీసుకుంది. దరిమిలా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023 అక్టోబరు 6న కేంద్రం కొత్త టీవోఆర్‌తో గెజిట్ విడుదల చేసింది. అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం పునఃపంపిణీని పరిశీలించాలని ట్రైబ్యునల్‌కు సూచించింది. దీనిని ఏపీ సవాల్ చేసింది

## ఉగ్రవాద చర్యలు సమాజానికి
# మాయని మచ్చ

(మొదటి పేజీ తరువాయి)
ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని ఆ కుటుంబాలకు ఇవ్వాలని ఆకాంక్షించారు.
ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ వంటివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చరిత్రను పరిశీలిస్తే, ఉగ్రవాదం, హింస ద్వారా ఏ లక్ష్యాలు నెరవేరలేదని స్పష్టమవుతుందని అన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.
దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో, ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో కేంద్రం తీసుకుంటున్న దృఢమైన, నిర్ణయాత్మక చర్యలకు తమ సంఘీభావం ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ఘోరానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు.

# ఎన్నికల కేసు కొట్టివేతకురేవంత్ పిటిషన్

(మొదటి పేజీ తరువాయి)
విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. భాజపా మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో చెప్పారని కాసం తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం ఆడియో, వీడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌పై గురువారం హైకోర్టులో విచారణ జరిగే అవకాశం ఉంది.

# ప్రశాంతంగా ఎంఎల్‌సి పోలింగ్

**హైదరాబాద్ ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** స్థానిక సం స్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అ ధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఉదయం 8 గం .ల నుండి సా. 4 గం.ల వరకు పోలింగ్ నిర్వహించగా, మధ్యాహ్నం 2 గంటల వరకే 78.57 శాతం ఓట్లు పో ల్ అయ్యాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కా ర్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేం ద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88మంది ఓట ర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.మొత్తం 112 ఓటర్లలో ఎక్స్ అఫిషియో మెంబర్‌లు 31 కాగా, అందులో 22 మంది ఓటు హక్కును వినియోగించుకు న్నారు. 81 మంది కార్పొరేటర్ల లో 66 మంది ఓటు హ క్కు వినియోగించుకున్నారు.'ఉదయం 8 గంటల నుం డి 10 గంటల వరకు 37.51 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు 77.68 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 78.57 శాతం పోలింగ్ నమోదు అయ్యింది. సా. 4 గం.ల వరకు 78.57 శా తం పోలింగ్ జరిగిందని తెలిపారు. ఎన్నికల పరి శీలకులు సురేంద్ర మోహన్ రిటర్నింగ్ అధికారితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను రిసెప్షన్ సెంటర్ కు బందోబస్తు మధ్య తీసుకువచ్చారు. వాటిని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూం వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నెల 25న ఉద్యం 8 గం.లకు ఓట్ల లెక్కింపు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో నిర్వహించడం జరుగుతుందని రిటర్నింగ్ అధికారి వెల్లడించారు.

# పాక్ కుట్రే..!

(మొదటి పేజీ తరువాయి)
1960 సెప్టెంబర్ 19న ప్రపంచ బ్యాంకు మధ్యవర్తిత్వంతో భారత్, పాకిస్థాన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. 1965, 1971, 1999 యుద్ధాల సమయంలోనూ నిలిచిన ఈ చారిత్రక ఒప్పందాన్ని భారత్ ఇప్పుడు నిలిపివేసింది. సీమాంతర ఉగ్రవాదాన్ని పాకిస్థాన్ విశ్వసనీయంగా, శాశ్వతంగా విడనాడే వరకు ఈ ఒప్పందం నిలిపివేతలో ఉంటుందని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ స్పష్టం చేశారు.
మరో కీలక నిర్ణయంగా, అటారీ-వాఘా ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌ను తక్షణమే మూసివేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటికే చెల్లుబాటు అయ్యే అనుమతులతో సరిహద్దు దాటిన వారు 2025 మే 1వ తేదీలోగా ఇదే మార్గం గుండా తిరిగి తమ దేశాలకు వెళ్లవచ్చని సూచించారు.
సార్క్ వీసా మినహాయింపు పథకం (ఎస్.వీ.ఈ.ఎస్.) కింద పాకిస్థానీయులకు వీసాలు నిలిపివేశారు. గతంలో జారీ చేసిన ఎస్.వీ.ఈ.ఎస్. వీసాలను రద్దు చేశారు. ప్రస్తుతం ఆ వీసాపై భారత్‌లో ఉన్న పాక్ జాతీయులు 48 గంటల్లో దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు.
ఇంకా, న్యూఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషన్‌లోని నేవల్, ఎయిర్ అడ్వైజర్లను 'పర్సన నాన్ గ్రాటా' (అవాంఛనీయ వ్యక్తులు)గా ప్రకటించారు. వారు వారం రోజుల్లోగా భారత్ విడిచి వెళ్లాలని ఆదేశించారు. దీనికి ప్రతిగా ఇస్లామాబాద్‌లోని భారత హైకమిషన్ నుంచి నేవీ, ఎయిర్ అడ్వైజర్లను భారత్ ఉపసంహరించుకోనుంది. ఇరు దేశాల హైకమిషన్లలో ఈ పోస్టులు రద్దయినట్లేనని ప్రకటించారు. ఈ అధికారుల సహాయక సిబ్బంది ఐదుగురిని కూడా ఇరువైపులా వెంటనే ఉపసంహరించనున్నారు.
ఇరు దేశాల హైకమిషన్లలోని మొత్తం సిబ్బంది సంఖ్యను ప్రస్తుతమున్న 55 నుంచి 30కి తగ్గించనున్నారు. ఈ తగ్గింపు ప్రక్రియ 2025 మే 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు.
సీసీఎస్ సమావేశంలో భద్రతా పరిస్థితులను సమీక్షించి,



భద్రతా దళాలను అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు విక్రమ్ మిస్రీ తెలిపారు. పహల్గామ్ దాడికి పాల్పడిన వారిని, వారికి సహకరించిన వారిని చట్టం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు. ఇటీవల తహవ్వూర్ రాణాను అప్పగించిన తరహాలోనే, ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని, కుట్ర పన్నిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన నొక్కి చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు విజయవంతంగా జరగడం, ఆ ప్రాంతం ఆర్థిక వృద్ధి వైపు పయనిస్తున్న తరుణంలో ఈ దాడి జరగడాన్ని సీసీఎస్ తీవ్రంగా పరిగణించిందని మిస్రీ వివరించారు.

# వీరే ఆ టెర్రరిస్టులు



కశ్మీర్ ఫహల్గామ్‌లో ఇటీవల నరమేథం సాగించినట్లు అనుమానిస్తున్న ఉగ్రవాదులు ముగ్గురి ఊహాచిత్రాలను (స్కెచ్) జమ్మూ కశ్మీర్ పోలీసులు బుధవారం విడుదల చేశారు. వీరికి సంబంధించిన వివరాలు , ఆచూకి ఉంటే తమకు తెలియచేయాలని ప్రకటన వెలువరించారు. మంగళవారం ముష్కరులు జరిపిన అతి సమీపపు కాల్పుల్లో 26 మంది మృతి చెందారు. వీరిలో ఎక్కువగా పర్యాటకులే ఉన్నారు. రెండు మూడు రకాల స్కెచ్‌లను , ఘటనాస్థలిలోని ప్రత్యక్ష సాక్షుల కథనాల మేరకు ఇప్పుడు విడుదల చేశారు. ఉగ్రవాదుల మూకను పట్టుకోవడానికి పోలీసు బలగాల దర్యాప్తు ముమ్మరం అయింది. ఉగ్రవాదులు ముగ్గురూ యువకులే. వీరిలో నూనుగు మీసాలు, చిన్నపాటి గడ్డంతో ఉన్నవాడు కూడా ఒక్కడున్నాడు. ఈ ఉగ్రవాద అనుమానితుల పేర్లు అసిఫ్ ఫౌజీ, సులేమాన్ షా, అబూ తల్హా అని , వీరికి మూసా, యూనస్, అసిఫ్ అనే మారు పేర్లు కూడా ఉన్నాయని అధికారులు తెలిపారు.కశ్మీర్‌లో ఇంతకు ముందు జరిగిన పలు ఉగ్రవాద దాడుల వెనుక వీరు ఉన్నట్లు, ఇప్పుడు జరిపింది వీరి చర్యలలో పరాకాష్ట వంటిదని వివరించారు. పాకిస్థాన్ కేంద్రీకృత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు అనుబంధంగా కొత్తగా పుట్టుకొచ్చిన ది రెసిస్టెంట్స్ ఫోర్స్ ( ఆర్ఎఫ్)కు చెందిన వారుగా వీరిని అనుమానిస్తున్నారు. ఫహల్గామ్‌లోని బైసారన్ పర్యాటక పచ్చికమైదానాలలో వీరు రక్తపాతం సృష్టించి వెళ్లారు. నిషేధిత లష్కరే తోయిబా ఆగకుండా జరుపుతున్న ఉగ్రవాద దాడుల జాబితాలో ఇప్పుడు ఈ ఘటన కూడా చేరింది. స్కెచ్‌లను కేంద్రీయ భద్రతా బలగాలు , నిఘా సంస్థలు కూడా ధృవీకరించాయి. ఈ ముగ్గురిలో ఒక్కడు హతుడైనట్లు ప్రకటించారు. మిగతా ఇద్దరిని పట్టుకుంటే దాడి వివరాలు, పాకిస్థాన్ లోగుట్టు తెలిసేందుకు వీలుంటుంది. ఫహల్గామ్ ఇతర ప్రాంతాలలో భద్రతా బలగాలు సోదాలు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రాంతంలోనే మరి కొందరు ఉగ్రవాదులు పొంచి ఉన్నట్లు, మరిన్ని దాడులను చేసేందుకు అవకాశం కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడైంది.

# ప్రజల గొంతుక బిఆర్ఎస్

**ఎల్కతుర్తిఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):**
చరిత్రలో ఎన్నో పార్టీ లు పుట్టుకొచ్చి కాలగర్భంలో కలిసిపోయినా ఒక్క బిఆర్ఎస్ పార్టీ ప్రజల కోసం నిలబడి ప్రజా గొం తుకగా నిలిచిందని మాజీ మంత్రి, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు అన్నారు. వరంగల్ ఉ మ్మడి జిల్లా, హన్మకొండ ఎల్కతుర్తిలో పార్టీ రజతోత్సవ బహిరంగ సభ ఏర్పాట్లను ఆయన బుధవా రం పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అ నంతరం ముందుగా జమ్ము కాశ్మీర్‌లో ఉగ్రవాదు ల చేతలో హతమైన భారతీయులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈసందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ఇది ఏ రాజకీయ లబ్ధి కోస మో చేస్తున్నటువంటి సభ కాదన్నారు. టిఆర్ఎస్ (బిఆర్ఎస్) స్థాపించి 25 సంవత్సరాలు పూర్తి చే సుకున్న సందర్భంగా జరుగుతున్న సభ అని అ న్నారు. దేశ చరిత్రలో ఎన్నో పార్టీలు పుట్టుకు వచ్చి కనుమరుగై పోయాయని అన్నారు.చివరి దాకా నిలబడింది రెండు పార్టీలు మాత్రమేనని అన్నారు. ఒకటి దివంగత ఎన్టీ రామారావు స్థాపించిన టిడి పి, మరో పార్టీ కెసిఆర్ స్థాపించిన బిఆర్ఎస్ పార్టీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా కం టక పాలన చేస్తుంటే ఎదిరించి పోరాడే శక్తి ఒక్క బిఆర్ఎస్‌కే ఉందన్నారు. బిజెపి, కాంగ్రెస్ ఒక్కటేనని, ఆ రెండు పార్టీలు అనుకొని పనిచేస్తున్నాయ న్నారు. మూసీ ప్రాజెక్టుతో దాని పరివాహక ప్రాం త ప్రజలు ఇబ్బందులు పడుతున్నా



బిజెపి నేతలకు వారి బాధలు పట్టకపోగా కాంగ్రెస్‌కు వంత పాడుతున్నారన్నారు. మూసీ, హెచ్‌యుసి, హైడ్రా లాం టి పనులతో ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేస్తూ విధ్వంసం చేస్తోందని ఆరోపించారు. ఈ అరాచకంపై ప్రశ్నించే పార్టీ ఏదైనా ఉందా అంటే అది ఒక్క తమ పార్టీయేనని అన్నారు. ప్రజా సమస్యలపై నేడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న పార్టీ బిఆర్ఎస్ అన్నారు. రజతోత్సవ బహిరంగ సభకు కొద్ది రోజుల సమయం ఉందని, పల్లె పల్లె కదిలి లక్షలాదిగా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రజతోత్సవ సభకు రాష్ట్ర నలుమూల నుంచి వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పార్కింగ్ సౌకర్యం హన్మకొండ వైపు నుంచి వాహనాలు సురావైన్స్ వైపు, హుజురాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలు ఎమ్మార్వో కార్యాలయం వైపు, సిద్దిపేట నుంచి వచ్చే వాహనాలు ఇంద్రనగర్‌లో మూడుచోట్ల కలిపి సుమారుగా 800 ఎకరాల్లో పార్కింగ్ సౌకర్యం కల్పించామని చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో సభకు వచ్చే జనాలు సేద తీరడం కోసం పది లక్షల వాటర్ బాటిల్స్, పది లక్షల మజ్జిగ ప్యాకెట్లను అవసరమనుకుంటే ఇంకెక్కువనైనా సమకూర్చే విధంగా ఏర్పాట్లు చేసుకున్నామని అన్నారు.వేదిక చుట్టుపక్కల 10 నుండి 20 చోట్ల 100 పడకలతో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని, 15 ఎమర్జెన్సీ అంబులెన్స్ ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తూనే సమయానికి కరెంటుకోత పెడుతుందేమోనన్న ఉద్దేశంతో 240 కేవి జనరేటర్ ఏర్పాటు చేసుకున్నామని అన్నారు. ఇప్పటికే సూర్యాపేట, వర్ధన్నపేట, తొర్రూర్ ప్రాంతాల నుండి వందలాదిగా రైతులు ఎడ్లబండ్లు కట్టుకొని బయలుదేరారని, ఇదంతా స్వచ్ఛందంగా రైతులే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకతో బయలుదేరారని అన్నారు. జరగబోయే సభ చరిత్రలో నిలిచిపోయే విధంగా 15 లక్షల ప్రజలు రాబోతున్నారని, ఇప్పటికే వాహనాలు సమకూర్చుకోవడం తోపాటు ఇంకా ఎక్కువ కూడా ఏర్పాటు చేయమని సందేశాలు పంపుతున్నారని అన్నారు. సభ నిర్వహణ అంగరంగ వైభవ%శీ%గాఏర్పాటు చేసిన ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లా ఉద్యమం నుండి కెసిఆర్‌కు అండగా నిలి చిందని, అందుకే వరంగల్‌లో రజతోత్సవ వేడుకల సభ ఇక్కడ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

# మహిళను కోటీశ్వర్లుగా చెయ్యడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- గ్రామీణ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- త్వరలోనే మహిళలకు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలకు ప్రోత్సాహం
- ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, ఈషా ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభించిన మంత్రి సీతక్క







**మహబూబాబాద్/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో మహిళా శక్తి క్యాంటీన్, ఇషా ప్రైవేట్ హాస్పటల్ ను రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న మహిళలకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో ఈ సంవత్సరం 20 వేల కోట్ల రూపాయలు రుణాలు బ్యాంక్ లీకేజీ ద్వారా అందించామన్నారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ లను ప్రారంభించడం జరుగుతుందన్నారు. నూతనమైన ఆహార పదార్థాలతో క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క తెలిపారు అదే విధంగా మహిళలు మీ సేవ కేంద్రాలు, ఈవెంట్ మేనేజ్మెంట్, డైరీ ఫాంలు, సోలార్ లైట్స్, 60 లక్షల పాఠశాల ఏక రూప దుస్తులను మహిళా సంఘాల ద్వారా కుట్టించామని పేర్కొన్నారు. మహిళా శక్తి క్యాంటీన్?లలో ఆహారం అమ్మ చేతి వంటల ఉండాలని, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మహిళా శక్తి క్యాంటీన్లు దేశానికే ఒక బ్రాండ్ గా నిలవాలని, స్థానిక వనరులు ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మహిళా శక్తి బిజినెస్ మోడల్స్ ను త్వరలోనే రూపొందిస్తామన్నారు. రానున్న 5 సంవత్సరాలలో మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు అందించడంతో పాటు మీసేవ, పౌల్ట్రీ, డైరీ వ్యాపారాలు, క్యాంటీన్ల ఏర్పాటుకు అన్ని రకాల ప్రోత్సాహకాలు ప్రభుత్వం అందించడం జరుగుతుందన్నారు. వడ్డీ లేని రుణ సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు సేవాభావం అలవర్చుకోవాలి

- జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి
- ప్రతి ఒక్కరూ మంచితనం కలిగి ఉండాలి
- ఇంటర్ విద్యార్థులను సన్మాన మంత్రి సీతక్క



**ములుగు/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ఉన్నత చదువులు చదవడం గొప్పకాదని, ఉన్నత చదువులతో పాటు సేవాభావం అలవర్చుకుంటే గుర్తింపు లభిస్తుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. అధ్యక్షతన ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క హాజరైనారు. ఈ సందర్భంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలను ప్రకటించిన సందర్భంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపిన విద్యార్థినీ, విద్యార్థులను మంత్రి సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జిల్లాలోని విద్యార్థినీ విద్యార్థులు మొదటి స్థానంలో నిలవడం ఆశించదగ్గ విషయమన్నారు. ఎంత నేర్చుకున్నాం అనేది ముఖ్యం కాదని చెప్పారు. నేర్చుకునే విషయాలు అనేకంగా ఉంటాయని తెలిపారు. ఎవరైనా సముద్రాన్ని దాటగలరు కానీ, జ్ఞానం ఎంత నేర్చుకున్న సరిపోదని చెప్పుకొచ్చారు. పోటీ పరీక్షల్లో నెగ్గడానికి జ్ఞానం పెంపొందించుకోవాలని, ఉన్నత చదువులు చదివిన వారు సేవ భావం లేనప్పుడు వారి చదువుకు గుర్తింపు ఉండదని అభిప్రాయపడ్డారు. ఉన్నత చదువులు చదివిన వారు మారుమూల గ్రామాలలోని ప్రజలకు సేవలు అందించడానికి ముందుకు రావాలని కోరారు. తాను సైతం భీకరమైన కరోనా సమయంలో ఏజెన్సీ గ్రామాలలో పలు కార్యక్రమాలు నిర్వహించడంతోనే తనకు గుర్తింపు లభించిందని వివరించారు. పిల్లలను, పెద్దలను గౌరవించడం నేర్చుకోవడంతో పాటు సమాజ సేవ బాధ్యతలను నేర్చుకోవాలని సూచించారు. హాయ్ అనే పలకరింపు పదం మన సంస్కారం కాదని, నమస్కారమే మన సంస్కారమని తెలిపారు. ములుగు జిల్లా విద్యార్థులతో పాటు తాను బాధ్యతలు వహిస్తున్న అసిఫాబాద్ జిల్లా విద్యార్థులు రెండవ స్థానంలో ఉండడం తనకు గర్వకారణంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి రాష్ట్రం, దేశంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని, ములుగు జిల్లా విద్యార్థినీ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలపడానికి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు చొరవ చూపడం అభినందనీయమని హర్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక బహుమతులు అందజేయడంతో పాటు సన్మాన కార్యక్రమాన్ని, పలు స్వచ్ఛంద సంస్థల ద్వారా అవార్డులు ఇప్పిస్తామని అన్నారు. ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో ఎదుగుతూ సమాజ స్థితిగతులపై అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి చంద్రకళ, లెక్చరర్లు, విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# సరస్వతి పుష్కరాల పనులను అధికారులు సీరియస్ గా తీసుకోవాలి

## -దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్.







**భూపాలపల్లి/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** సరస్వతి పుష్కరాల పనులను అధికారులు సీరియస్ గా తీసుకోవాలి దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అన్నారు. బుధవారం కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ శ్రీమతి అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, పనులను క్యాజువల్ గా తీసుకోవద్దని సీరియస్ గా తీసుకుని పూర్తి చేయాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను, కాంట్రాక్టర్లు ను ఆదేశించారు. బుధవారం కాళేశ్వరం వద్ద సరస్వతి పుష్కర పనులను సంగీత నాటక అకాడమీ ఛైర్మన్ అలేఖ్య పుంజాల, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఆర్జేసి రామకృష్ణ రావు, విద్యుత్తు శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ సత్యనారాయణ, డిపిఓ నారాయణ రావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, దేవాదాయ శాఖ ఈఈ కనక దుర్గా ప్రసాద్, పీఆర్ ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నిర్మల, ఇరిగేషన్ ఈఈ తిరుపతి రావు, ధార్మిక అడ్వైజర్ గోవింద రాజు, ఇతర జిల్లా అధికారులతో కలసి విఐపి ఘాట్, సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు, 100 గదుల సత్రం పనులు పరిశీలించారు.

అనంతరం ఈఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖల వారిగా చేపట్టిన పనుల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు పూర్తి చేయుటపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 10 రోజులు చాలా ముఖ్యమని తెలిపారు. ప్రతి రోజు పనులలో ప్రగతి రావాలని ఆదేశించారు. ప్రతి రోజు పనుల ప్రగతి, పనులు వాట్సప్ గ్రూపులో పోస్ట్ చేయాలని సూచించారు.సరస్వతి విగ్రహం ఏర్పాటు మే మొదటి వారం వరకు పూర్తి చేయాలని దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సమయం సమీపిస్తున్నదని పనుల్లో వేగం పెంచాలని, రేయింబవళ్లు పనులు జరిగితే తప్ప పనులు పూర్తి కావని, ఆశించిన స్థాయిలో వేగంగా పనులు జరగడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మే మొదటి వారం వరకు 7 హారతి ప్లాట్ ఫార్మ్ కుడా పూర్తి చేయాలని తెలిపారు. ఘాట్, సరస్వతి విగ్రహం, సత్రం పనులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర పనులు పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక పర్యవేక్షణ అధికారులుగా నియమించి నిరంతరం పనులను పర్యవేక్షణ చేయు విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మే 10వ తేదీ వరకు అన్ని పనులు పూర్తి కావాలని, ఇంజినీరింగ్ అధికారులు పనులు పూర్తి చేయుటకు టైం షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా జరుగుతున్న కార్యక్రమమని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద శాశ్వత మరుగుదొడ్లు, షవర్స్, భక్తులు బట్టలు మార్చుకునే గదులు 12 వ తేది వరకు ఫుల్ షేప్ లో పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. భక్తులు నది వరకు వెళ్ళడానికి అనువుగా అప్రోచ్ రోడ్డు నిర్మించాలని, వేసవి దృష్ట్యా నదిలోకి భక్తులు వెళ్ళడానికి అనువుగా క్వయర్ మాట్ ఏర్పాటు చేయుటలో అవగాహన లేకుండా ఎందుకు చెప్తున్నారని పీఆర్ ఈఈపై జిల్లా కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విఐపి ఘాట్ వద్ద అదనంగా తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలని ఆర్ డబ్ల్యూఎస్ ఈఈకి సూచించారు. సాలీడ్ వేస్ట్ మేనేజ్మెంట్ తరలించడానికి 4 వాహనాలు సిద్ధంగా ఉంచాలని, గోతిలో సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వేసి పూడ్చాలని సూచించారు. విఐపి ఘాట్ వద్ద లైటింగ్ పనులు 10వ తేదీ వరకు పూర్తి చేయాలని అన్నారు. విఐపి ఘాట్ వద్ద 100 కెవి సబ్ స్టేషన్ ఏర్పాటుతో పాటు 125 కెవి జనరేటర్ సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. విఐపి ఘాట్ వద్ద సూచన చేసిన ప్రకారం మొక్కలు నాటాలని మే 10 వరకు పూర్తి చేయాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. ఘాట్ పైన చలువ పందిళ్లు వేయాలని సూచించారు. ఏదేని సమస్య ఉంటే తెలియచేయాలని, చెప్పకుండా మీలోనే దాచుకుంటే ఎలా చెప్పండి, సమస్య అలానే ఉండాకూడదని. భక్తులు ఇబ్బందులు పడకుండా, సీరియస్ గా తీసుకోవాలని సూచించారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క



**ములుగు/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ములుగు మండల పరిధిలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం జరిగిన వివాహ వేడుకలకు రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క హాజరైనారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను వారు ఆశీర్వదించారు. వారి వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రామాలయ అభివృద్ధి పనులకు భూమి పూజ

## - మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క





**ములుగు/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ములుగు జిల్లా కేంద్రంలోని రామాలయ ప్రాంగణంలో 10 లక్షల రూపాయలతో బుధవారం ఆలయ అభివృద్ధికి మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క భూమి పూజ చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మంత్రిని శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని, రాబోయే రోజుల్లో మరిన్ని పనులు చేపట్టే విధంగా కృషి చేస్తానని ములుగు నియోజకవర్గంలోని ప్రతి దేవాలయానికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, బ్లాక్, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోరిక లక్ష్మీబాయి చిత్రపటానికి నివాళులు

## - మంత్రి దనసరి అనసూయ సీతక్క





**హనుమకొండ/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్ తల్లి స్వర్గీయ పోరిక లక్ష్మీబాయి సంవత్సరిక కార్యక్రమం బుధవారం హన్మకొండలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వారి వెంట ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవి చందర్, మాజీ మార్కెట్ చైర్మన్ రామ్ రెడ్డి, ములుగు మండల అధ్యక్షులు చంద్ పాషా, నల్లెల భరత్, వెంకటాపూర్ మండల అధ్యక్షులు సూర్యనారాయణ, వంగ రవి యాదవ్, లచ్చు పటేల్ తదితరులు ఉన్నారు.

# సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో భోజనం

## - అన్నదాతకు చీరను బహుకరించిన కలెక్టర్

### - ఆడపడుచు కట్నంతో పాటు శాలువాతో సన్మానించిన ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు





**పర్వతగిరి/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** పర్వతగిరి మండల కేంద్రంలో చెనిమాల పుష్ప నర్సయ్య సన్న బియ్యం లబ్ధిదారుని ఇంట్లో జిల్లా కలెక్టర్ సత్య శారదా, వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు భోజనం చేశారు. అన్నదాత సుఖీభవ అని దీవిస్తూ, దంపతులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా చీరను బహుమానంగా సమర్పించారు. ఎమ్మెల్యే ఇంటి ఆడపడుచుల కట్నం పెడుతూ వారిని శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె ఆర్ నాగరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల కోసం మహత్తరమైన పథాకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. రాష్ట్రంలో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికి ఉచితంగా సన్న బియ్యాన్ని సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఈ పథకం పేదల గుండెల్లో నిలుస్తుందని పేర్కొన్నారు.సన్నబియ్యం సరఫరాలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల సత్వర పరిష్కారానికి రూపొందించిన

# భూ భారతి చట్టం చారిత్రాత్మకం

### - నూతన ఆర్ ఓ ఆర్ చట్టంపై అవగాహన సదస్సు - పాల్గొన్న వరంగల్ జిల్లా కలెక్టర్, వర్ధన్నపేట ఎమ్మెల్యే







**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** రాష్ట్రంలో భూ సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన చట్టం భూ భారతి చట్టమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజ అన్నారు. బుధవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండల కేంద్రంలోని ఏబీఎన్ ఫంక్షన్ హాల్, పర్వతగిరి మండలం కేంద్రంలోని పిఏసీఎస్ భవనంలో రైతులు, ప్రజలకు నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూ భారతి- నూతన ఆర్ఓఆర్ చట్టానికి సంబంధించిన అంశాలు, మార్గదర్శకాలపై వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ భూ సమస్యలు లేని రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దాలన్న లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారధ్యంలో భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని అన్నారు. అత్యంత ప్రతిష్టాత్మకమైన భూ భారతి చట్టం ప్రయోజనాలు సామాన్య ప్రజలకు చేరినప్పుడే దానికి సార్ధకత ఏర్పడుతుందని అన్నారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి దేశానికే రోల్ మోడల్ అని అన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలనే సదుద్దేశంతో భూ భారతి పోర్టల్‌ను తీసుకొచ్చామని తెలిపారు. రైతులు, ప్రజల అభిప్రాయాలను తీసుకునే భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు.

రాష్ట్రంలోని 4 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ చట్టం అమలు చేస్తున్నారని, తదుపరి భూములకు సంబంధించిన సమస్యలపై రైతులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ధరణి పోర్టల్ తీసుకురావడంతో గ్రామాల్లో మనశ్శాంతి లేకుండా పోయిందన్నారు. రైతులు, ప్రజలు భూ సమస్యలు పరిష్కరించేందుకు ఈ చట్టం తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా సమస్యలు ఒక్క పైసా ఖర్చు లేకుండా నిజమైన రైతులకు, ప్రజలకు భూ హక్కులు లభిస్తాయన్నారు. భూ భారతి చట్టం వల్ల రైతులకు, పేదలకు ఎంతో మేలు కలుగుతుందని తెలిపారు. ఎంతోమంది మేధావులు, అధికారులు భూభారతి చట్టానికి రూపకల్పన చేయడం జరిగిందన్నారు. ఈ చట్టం ద్వారా ఏవైనా న్యాయపరమైన సమస్యలు తలెత్తినప్పుడు కమిషన్ ఏర్పాటు చేస్తారని, తద్వారా వాటి పరిష్కారానికి చర్యలు చేపడతారని అన్నారు.

భూ భారతి చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, పకడ్బందీగా అమలు చేయాలన్న లక్ష్యంతో జిల్లాలోని అన్ని మండలాల్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజల మేలు కోసం ఈ చట్టాన్ని తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామ పరిపాలన అధికారులను ప్రభుత్వం నియమిస్తుందని తెలిపారు.

### భూముల పై భరోసా కల్పించేందుకే భూ భారతి చట్టం

ప్రజల కోసం, ప్రత్యేకించి రైతులకు వారి భూములపై భరోసా కల్పించేందుకు, రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపారు. ధరణి పోర్టల్ లో లేని అనేక సమస్యలకు పరిష్కారం భూ భారతి చట్టం ద్వారా లభించనుందని అన్నారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైనా అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ సమస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే, భూ భారతి చట్టాల ప్రకారం అప్పిలు చేసుకునే అవకాశం కూడా ఉందని అన్నారు. గతంలో తహశీల్దార్ పరిష్కరించే చిన్న చిన్న సమస్యలు కూడా కలెక్టర్ దగ్గరికి వచ్చేవని, వేల సంఖ్యలో దరఖాస్తులు రావడం వల్ల పరిష్కరించడంలో జాప్యం జరిగేదని తెలిపారు. భూభారతి ద్వారా కింది స్థాయికి అధికారులకు కూడా బాధ్యతలు అప్పగించారని దీనివల్ల భూమికి సంబంధించిన చిన్న సమస్యలు మండల స్థాయిలోని సత్వరం పరిష్కారం అవుతాయని తెలిపారు. ఈ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ కరెక్షన్, నాలా, అప్పీల్, భూముల వివరాలు, భూముల మార్కెట్ విలువ, నిషేధిత భూములు, ఈ చలాన్ అప్లికేషన్ స్టేటస్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ వివరాలు, ఇతరాల పేరిట ప్రత్యేక మాడ్యూల్స్, సెక్షన్స్ గురించి కలెక్టర్ వివరించారు. భూ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన భూ భారతి చట్టం మార్గదర్శకాలను రైతులు, ప్రజలకు తెలియజేసేందుకు జిల్లాలో అన్ని మండలాల్లో ప్రతిరోజు 2 మండలాల చొప్పున నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రతి ఒక్కరికీ నూతన చట్టం భూ భారతి, దానిలోని అంశాల పట్ల సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఇంతకు ముందు ఉన్న ధరణిలో కోల్పోయిన హక్కులు, కొత్త చట్టంలో ఎలాంటి హక్కులపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరైన ప్రతి ఒక్కరు తమ తమ గ్రామాల్లో నూతనంగా తీసుకువచ్చిన భూభారతి చట్టం గురించి ప్రజలకు రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా స్థాయిలో రైతులకు, ప్రజలకు లీగల్ సర్వీస్ అథారిటీ ద్వారా న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే భూ భారతిలో మూడంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని కలెక్టర్ అన్నారు.



ఈ సందర్భంగా నూతన చట్టం, తమ భూ సమస్యల గురించి ఆయా గ్రామాల రైతులు, ప్రజలు అభిప్రాయాలను వెల్లడించారు. సదస్సులో వర్ధన్నపేట, పర్వతగిరి మండలాలలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు, ప్రజల భూ సమస్యలకు సంబంధించిన సందేహాలను రెవిన్యూ అధికారులు నివృత్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా నీటిపారుదల అధికారి శంకర్, జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు గౌస్ హైదర్, ఆర్డీఓ సత్యపాల్ రెడ్డి, వర్ధన్నపేట తహశీల్దార్ విజయ్ సాగర్, పర్వతగిరి తహశీల్దార్ వెంకటస్వామి, ఎంపిడిఓలు వెంకటరమణ, శంకర్, పిఏసీఎస్ చైర్మన్లు గొర్రె దేవేందర్, మనోజ్ గౌడ్ స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ గ్రామాల రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం తోనే సంపూర్ణ ఆరోగ్యం

### - తహసీల్దార్ ఏం శ్రీనివాస్

**రాయపర్తి/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):**పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రభుత్వం అంగన్ వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పోషకాహారాలను గర్భవతులు, బాలింతలు పిల్లలు, సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాయపర్తి మండల కేంద్రంలోని రైతు వేదిక ఆవరణలో పోషణ పక్వాడ కార్యక్రమ%శీ%లో భాగంగా పోషణ జాతర ను కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాలలో పేదల ఆరోగ్యం కోసం గర్భిణీ బాలింతలు ,కిశోర బాలికలు 0 సున్నా నుండి 06 సంవత్సరాల లోపు పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని అందిస్తుందని అన్నారు. అదే కాకుండా పాలు ,గుడ్లు ఆకుకూరలు అందించి ఆరోగ్యప్రదమైన సమాజము కోసం ప్రభుత్వాలు కృషి చేస్తున్నందున పౌష్టికాహారాన్ని తీసుకొని ఆరోగ్యపరంగా ఉండాలని కోరారు. పిల్లలను అందత్వ నివారణ, రక్తహీనత లాంటి వ్యాధుల కోసం సరియైన పోషకాహారాన్ని తీసుకొని సద్వినియోగం చేసుకోవాలి కోరారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. పిల్లల్లో రక్తహీనత నివారణకు పౌష్టికఆహారం తీసుకోవాలని ఏపీఎం కిరణ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం కిరణ్ కుమార్,సిడిపిఓ డెబోరా, సూపర్వైజర్ విజయలక్ష్మి, అంగన్వాడి టీచర్లు ఐత కృష్ణవేణి, గారే కవిత,విజయ రాణి, చంద్రకళ,శశిరేఖ, యాకుబి, వివిధ గ్రామాల అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.







## ధాన్యం కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలి

### - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య





**హనుమకొండ/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** కాజీపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో సోమిడిలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు ఇప్పటి వరకు ఎంత ధాన్యం వచ్చిందని, సరిపోను గన్ని బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయా? ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పుడు తేమశాతాన్ని చూస్తున్నారా? కొనుగోలు కేంద్రం వద్ద ఎలాంటి ఏర్పాట్లను చేశారని అధికారులు, నిర్వాహకులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా, ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యంలో తాలు లేకుండా శుభ్రంగా ఉండాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు ఎప్పటికప్పుడు తరలించాలని తెలిపారు. రవాణా సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ధాన్యం అమ్మిన రైతుల వివరాలను వెంటనే ఆన్లైన్ లో నమోదు చేయాలన్నారు. ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో వారి ఖాతాల్లో అమ్మిన దాన్యం డబ్బులు జమ అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అధికారులు నిర్వాహకులకు, హార్వెస్టర్ యజమానికి పలు సూచనలు చేశారు. హార్వెస్టింగ్ యజమానులు యంత్రం ద్వారా వరికోత చేస్తున్నప్పుడు ధాన్యం శుభ్రంగా వచ్చేటట్టు చూడాలని అధికారులు వారికి తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగాలని ఆదేశించారు. వారి వెంట జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, కాజీపేట తహశీల్దార్ బావ్ సింగ్, ఇతర అధికారులు, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పోషణ పక్షం ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న

# హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావిణ్య








**హనుమకొండ/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలు పౌష్టిక ఆహారం తప్పనిసరిగా తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమం జిల్లా సంక్షేమ అధికారి జె. జయంతి అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించాలంటే జిల్లాలోని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రణాళికబద్ధంగా లబ్ధిదారులకు అందాల్సిన సేవలు సకాలంలో అందించాలని, లోపపోషణ లేని సమాజ నిర్మాణానికి కృషి చేయాలని అన్నారు. అంగన్వాడీ కేంద్రం ద్వారా అనుబంధ పోషకాహారం, ఆరోగ్యం, పోషకాహార విద్య, ప్రీస్కూల్ విద్య, రోగనిరోధకత, రెఫరల్ సేవలు,ఆరోగ్య పరీక్షలు తదితర సేవలు అందుటకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. పోషణ పక్వాడ 2025 ఉద్దేశాలకనుగుణంగా మొదటి వంద రోజులపై దృష్టి సారించాలని, గర్భిణీ దశ నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల వయసు వచ్చే వరకు 1000 రోజులుగా పరిగణించబడుతుందని అన్నారు. ఈ సందర్భంగా జాతీయ బాలిక దినోత్సవం రోజున (జనవరి 24)

ఆడ పిల్లలకు జన్మ నిచ్చిన ఐదుగురు చిన్నారులను వారి తల్లి తండ్రులకు తివాచి పరచి ఘనంగా స్వాగతించి కలెక్టర్ ఆధ్వర్యంలో సన్మానించారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్న ప్రాసన, గర్భిణీలకు సీమంతం కార్యక్రమాల్ని నిర్వహించారు, ప్రీస్కూల్ పూర్తిచేసుకున్న చిన్నారులకు కాన్వోకేషన్ తదితర కార్యక్రమాలు, సుకన్య సమృద్ధి యోజన పథకం కింద ఆరుగురు లబ్ధిదారులకు పోస్టాఫీసు పాస్ పుస్తకాలను అందచేయడం జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా జిల్లాలోని మూడు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధి చిన్నారులు అంగన్వాడి కేంద్రం, వివిధ రకాల పాటలకు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్జేడీ ఝాన్సి లక్ష్మిబాయి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, ఆయుష్ వైద్యులు డాక్టర్ మహేందర్, జిల్లా న్యూట్రిషన్ స్పెషలిస్ట్ డాక్టర్ సరళ, సిడీపీఓలు విశ్వజ, స్వరూప, స్వాతి, పోషణ అభియాన్ జిల్లా కో ఆర్డినేటర్ టీ సుమలత, జిల్లా మిషన్ శక్తి కో ఆర్డినేటర్ డి కళ్యాణి, సీనియర్ అసిస్టెంట్ వి.వెంకట్రాం, ఎక్స్టెన్షన్ ఆఫీసర్ సింధురాణి, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఇన్చార్జి అధికారి ఎస్.ప్రవీణ్ కుమార్ ఐసీడిఎస్ సూపర్వైజర్లు, టీచర్లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రిజల్ట్ డే



పర్వతగిరి/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త): మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ పాఠశాలలో రిజల్ట్ డే ను మెగా తల్లిదండ్రుల ఉపాధ్యాయ సమావేశం బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక రమేష్ బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో 40 మంది తల్లిదండ్రులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థుల సంపూర్ణ వికాసానికి అపారమైన అనుభవం గల ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తుందని తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. పేరెంట్ అమ్మిలాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే అన్ని సౌకర్యాలు కలిగి ఉన్న పర్వతగిరి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చదవడం వారికి గర్వకారణంగా ఉందని తెలిపారు. తమ పేద విద్యార్థుల భవిష్యత్తు కొరకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే సంవత్సరం పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడానికి తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. ప్రతి తరగతిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు మెమొంటోలు బహూకరించారు. తదనంతరం ప్రతి విద్యార్థికి వార్షిక ప్రోగ్రెస్ కార్డును అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు శ్రీధర్, ఏ.మనోహర్, శాంతి కిరణ్, పరుశురాములు, రాధాకృష్ణ, కుమారి, రజిత, డాక్టర్ ఎం భాస్కర్, మౌనిక, డాక్టర్ ఎం రాజలక్ష్మి లేఖ, బైరీ తిరుపతి, ఎస్ రవీందర్ రవికుమార్, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# హిందువులపై దాడికి నిరసనగా శాంతి ర్యాలీ







**సత్తుపల్లి/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** కశ్మీర్ లో హిందువుల పై జరిగిన ఉగ్ర దాడిని నిరసిస్తూ బుధవారం పట్టణంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా హిందూ సంఘాల నాయకులు, హిందువులు సంఘటితంగా కోదండ రామాలయం నుంచి కాకర్లపల్లి రోడ్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు వందేమాతరం భారత్ మాతా కు జై.హిందువు ఐక్యత వర్ధిల్లాలి, ఉగ్రవాదం నశించాలి అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన చేశారు. బస్టాండ్ రింగ్ సెంటర్ లో రాస్తారోకో చేసి నిరసన తెలిపారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ మతం ఏమిటో అడిగి హిందూ అని చెప్పగానే హతమార్చిన ఉగ్రవాదం నశించాలంటు నినాదాలు చేశారు. మతం అడిగి చంపడం చాలా దారుణం అని ఏదేమైనా ఉగ్రవాదం అనేది ఏ రూపంలో ఉన్న దాన్ని సమూలంగా నాశనం చేయాలని కోరారు.సెక్యులర్ హిందువులు ఇప్పటికైనా కల్లుతెరవాలని, కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ ఐక్యత శాంతి ర్యాలీ లో హిందువులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వధూవరులకు సుదీర్ రెడ్డి ఆశీర్వాదం



**రాయపర్తి/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు చెగొండ ప్రశాంత్ చెల్లెలు శ్రీరీష-వెంకటేశ్వర్లు ల వివాహ వేడుకలో బుధవారం టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుధీర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

# బాలికపై కుక్కల దాడి

## - తీవ్ర గాయాలు ఆస్పత్రికి తరలింపు





చిట్యాల/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):చిట్యాల మండలంలోని గాంధీ నగర్ గ్రామానికి చెందిన రత్నం రమేష్ కూతురు నైనిషా బుధవారం తన ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా ఒకేసారి మూడు కుక్కలు దాడి చేశాయని బంధువులు తెలుపుతున్నారు. గ్రామస్తుల వివం ప్రకారంచిన్నారి మెడపై, భుజంపై తీవ్ర గాయాలు కాగా చిట్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో తాత్కాలిక ట్రీట్మెంట్ చేసి మెరుగైన వైద్యం కోసం వరంగల్లోని ఎంజిఎం ఆసుపత్రికి తరలించారు.

# ప్రతి గ్రామ పంచాయతీలో క్షయ నిర్ధారణ క్యాంపులు






**తల్లాడ/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):**తల్లాడ క్షయ ట్రీట్మెంట్ యూనిట్ పరిధిలో గల ప్రతి గ్రామ పంచాయతీలో క్షయ నిర్ధారణ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ట్రీట్మెంట్ చికిత్స సూపర్వైజర్ వై సురేష్ తెలిపారు. బుధవారం ఖమ్మం జిల్లా క్షయ నిర్మూలన అధికారి డాక్టర్ సుబ్బారావు ఆదేశాల మేరకు తల్లాడ ట్రీట్మెంట్ యూనిట్ పరిధిలోని తల్లాడ, కల్లూరు ,ఏన్కూరు,మండలాల్లోని ప్రతి గ్రామపంచాయతీని క్షయ రహిత పంచాయతీలుగా మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ట్రీట్మెంట్ చికిత్స సూపర్వైజర్ వై సురేష్ తెలియజేశారు తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రత్న మనోహర్ ఆధ్వర్యంలో కొడవటి మిట్ట గ్రామ పంచాయతీలో క్షయవ్యాధిపై అవగాహన నిర్వహించి, క్షయ వ్యాధి లక్షణాలున్న 22మంది నుంచి కళ్ళె నమూనాలు సేకరించి ఖమ్మం సి బి నాట్ పరీక్ష కేంద్రానికి పంపిస్తున్నామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పినపాక ఆయుష్మాన్ ఆరోగ్యం మందిర్ డాక్టర్ విజయ్ చందర్ మాట్లాడుతూ కొడవటి మిట్ట గ్రామపంచాయతీ క్షయ రహిత గ్రామపంచాయతీ గా మార్చడానికి కృషి చేస్తున్నామని క్షయ వ్యాధి లక్షణాలు రెండు వారాల పైబడి దగ్గు కల్లేరావడం, జ్వరం రావడం ,ఆకలి లేకపోవడం ,బరువు తగ్గడం, ఈ లక్ష్యాలు కనిపించినట్లయితే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు క్షయ వ్యాధికి సంబంధించిన పరీక్షలు మందులు ప్రభుత్వం పూర్తి ఉచితంగా అందిస్తుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో క్షయ వ్యాధి లాబ్ సూపర్వైజర్ ఆర్ సంజీవ్ కుమార్ ఏఎన్ఎం అరుణిమ, అన్నపూర్ణ ఆశ కార్యకర్త కృష్ణవేణి పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

## - ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర - ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు









**గణపురం/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** రైతులెవరూ దళారులను నమ్మి మోసపోవద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావురైతులకు సూచించారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండల కేంద్రంతో పాటు రవినగర్(జంగుపల్లి), గొల్లపల్లి గ్రామాలల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు మద్దతు ధర పొందాలంటే ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకే వరి ధాన్యాన్ని తీసుకురావాలన్నారు. దళారులను నమ్మి మోసపోకుండా జాగ్రత్తపడాలని రైతులకు సూచించారు. ధాన్యం తీసుకురాబోతున్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అక్కడున్న వివిధ శాఖల అధికారులకు ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగేలా అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షణ చేయాలని తెలిపారు. అదేవిధంగా, గత ప్రభుత్వంలో దళితులకు మూడెకరాల భూమి, దళితుడిని సీఎం చేస్తానని, ఇంటికో ఉద్యోగం ఇస్తానని.. ఇలాంటి అనేక హామీలను ఇచ్చి పదేళ్లు ప్రజలను మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ఇంతకీ ఇరవై ఐదేళ్ల ఉత్సవాలు టీఆర్ఎస్ పార్టీకా? తెలంగాణ పదాన్ని తీసేసిన బీఆర్ఎస్ పార్టీకా? అని ఎమ్మెల్యే సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు, వివిధ శాఖల అధికారులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు ఉన్నారు.

# నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ఘనంగా మాతృ దినోత్సవం



**సత్తుపల్లి/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):**నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సతుపల్లిలో బుధవారం మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని మై మామ్ మై ఏంజెల్ అనే ప్రత్యేక కార్యక్రమం ఎంతో ప్రేమతో, భావోద్వేగపూరితంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లుల కోసం స్వయంగా తయారు చేసిన గ్రీటింగ్ కార్డులు, చిన్నచిన్న బహుమతులు అందించగా, తల్లుల ముఖాలలో ఆనందం వెల్లివిరిసింది.తల్లులు తమ జీవిత అనుభవాలను, చిన్ననాటి జ్ఞాపకాలను పంచుకుంటూ ఈ వేడుకను మరింత హృద్యంగాపూర్వకంగా తీర్చిదిద్దారు.ఏజీఎం.రాంకీ మాతృదినోత్సవ ప్రాముఖ్యతను వివరించి, అందరి హృదయాలను హత్తుకునేలా మాట్లాడారు. కోఆర్డినేటర్ వినోధ లక్ష్మి .తల్లుల గొప్పతనాన్ని ప్రశంసించారు. ప్రిన్సిపల్ రామమూర్తి .తల్లి అంటే దేవత అని భావోద్వేగంగా పేర్కొన్నారు. కోఆర్డినేటర్ ప్రవీణ్ తన తల్లితో ఉన్న మధుర జ్ఞాపకాలను పంచుకోగా, కోఆర్డినేటర్ నీలిమ కూడా తన అనుభవాలను చెప్పి అందరినీ ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో ఏవో. జగదీష్ , ఏడి.రవీంద్ర . వైస్ ప్రిన్సిపల్స్ రమ్య .అనుష . పలువురు ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమం తల్లుల ప్రేమను గుర్తుచేస్తూ, అందరి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే అనుభూతిగా నిలిచింది.ం

# ఆరోగ్య సమస్యలపై అవగాహన

## - డిప్యూటీ డెమో అనిల్ కుమార్



**వరంగల్/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు ఆదేశానుసారం డిప్యూటీ డెమో అనిల్ కుమార్ బుధవారం రామన్నపేట అంగన్వాడి సెంటర్ లో పర్యటించారు. ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా నిర్వహిస్తున్న స్పెషల్ క్యాచ్ అప్ ప్రోగ్రాంలో భాగంగా ఇమినైజేషన్ సెషన్ పర్యవేక్షించారు. అనంతరం ఇమినైజేషన్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. ఎండాకాలంలో వచ్చే సాధారణ ఆరోగ్య సమస్యలు హీట్ స్ట్రోక్, నీళ్ల విరేచనాలు, బంక విరోచనాలు, చర్మవ్యాధులు వ్యాపిస్తాయన్నారు. అందువల్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అప్పుడే పుట్టిన బిడ్డ నుండి 18 సంవత్సరాల వయసు వచ్చు వరకు వయసుకు తగ్గట్టుగా వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి, బిడ్డ ఎలాంటి వ్యాధులకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ప్రజలు కూడా ఈ వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తమ బిడ్డల ఆరోగ్యం కొరకు వైద్య ఆరోగ్యశాఖ అందించే వ్యాధి నిరోధక టీకాల పట్టిక రూపంలో ఉన్న ప్రతి వ్యాక్సిన్ ఇప్పించాలని తెలిపారు. ప్రతి ఆరోగ్య మందిరంలో ఓ.ఆర్.ఎస్ కార్నర్ నిర్మించాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చిన తగిన చికిత్సలు చేయాలని కోరారు. ఎండాకాలంలో వచ్చు సమస్యలపై అవగాహన కల్పించాలని, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. ఆశా కార్యకర్త నుండి అందరూ సమన్వయంతో పనిచేసి తగిన ఫలితాలు సాధించి, జిల్లాను ఆరోగ్య జిల్లాగా మార్చడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకురాలు నర్మద, ఆరోగ్య కార్యకర్త సులోచన, ఆశా కార్యకర్త సోనీ, అంగన్వాడి కార్యకర్త స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ హాస్పిటల్లో డెలివరీలకు ప్రోత్సహించాలి

- బాధితులకు ప్రసవాలపై అవగాహన కల్పించాలి
- ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో పర్యటన
- వరంగల్ జిల్లా వైద్య అధికారి బి సాంబశివరావు





**వరంగల్/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** వరంగల్ జిల్లాలోని నర్సంపేట మహేశ్వరం ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో బుధవారం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు పర్యటించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సమయ పాలనపై వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు. మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు ప్రోత్సహించాలని సూచించారు. అనవసరమైన ఆపరేషన్లు జరగకుండా, గర్భిణీలకు వారి కుటుంబీకులకు సాధారణ ప్రసవాలపై అవగాహన కల్పించాలని కోరారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న ఇమ్మైజేషన్ క్యాచ్అప్ ప్రోగ్రాములో వ్యాధి నిరోధక టీకాలు అందించాలని తెలిపారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేయించి, తగిన చికిత్సలు అందించాలని వివరించారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ, ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవఖానాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారని తెలిపారు. అందువల్ల సిబ్బంది సమయ పాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్యాధికారులు, సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవలు, సిబ్బంది విధులపై తగిన సూచనలు చేశారు. సమయ పాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎండా కాలంలో వచ్చే ఆరోగ్య సమస్యలు నీళ్ల విరోచనాలు, బంక విరోచనాలు, అంటువ్యాధులు, వడదెబ్బపై ప్రజలలో అవగాహన కల్పించాలని, ఎలాంటి వ్యాధులకు గురైనా వెంటనే వారికి తగిన చికిత్సలు అందించాలని పేర్కొన్నారు. ఎండాకాలంలో ప్రతి ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలలో, ఆరోగ్య కేంద్రాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఓఆర్ఎస్ కార్నర్ పెట్టాలని సూచించారు. దంచి కొడుతున్న మండుటెండల్లో అత్యవసరమైతే తప్ప బయటికి వెళ్లకూడదని కోరారు. తప్పనిసరి పరిస్థితిల్లో బయటకు వెళ్లాల్సి వస్తే వెళ్లిన సమయంలో తలకు రూమాలు పూర్తిగా ధరించాలని తెలిపారు. వడదెబ్బకు గురైన వ్యక్తి వెంటనే ఇంటిలోని నిమ్మరసం, గంజి, కొబ్బరినీళ్లు, మజ్జిగ తీసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వివరించారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది సహాయంతో ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని, డాక్టర్ సలహా మేరకు చికిత్సలు పొందాలని సూచించారు.వారి వెంట స్థానిక వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆరోగ్య పర్యవేక్షకులు రామలింగయ్య, ఎల్డి కంప్యూటర్ నాగరాజు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల టాపర్గా నిలిచిన ఉమ్మడి సుప్రియ



ధర్మసాగర్/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త): ధర్మసాగర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల 2025 మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ బైపీసీలో 440 మార్కులు ఉండగా 396 మార్కులతో ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల బైపీసీలో టాపర్గా నిలిచారు. ఉమ్మడి సుప్రియ బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో లెక్చలర్లు మంచి బోధన అందిస్తున్నారని వారి ప్రోత్సాహంతోనే నేను 396 మార్కులతో ఇవ్వడం జరిగిందని రాబోయే రోజుల్లో మంచి మార్కులతో కళాశాలకు పేరు తీసుకు వస్తారని తెలిపారు ప్రతి ఒక్క విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలని పిలుపునిచ్చారు.

# కంఠమహేశ్వర స్వామి సన్నిధిలో -ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్




**వైరా/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** శ్రీ కంఠమహేశ్వర స్వామి వారి ప్రధమ వార్షికోత్సవం బుధవారం నిర్వహించగా వైరా నియోజకవర్గం ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు. ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం.స్వర్ణ వారి వివాహ వేడుకలో హాజరై నూతన వధువరులకు ఆశీర్వదించారు.వైరా మున్సిపాలిటి 3వ వార్డు శ్రీ కంఠ మహేశ్వర స్వామి వీధి (గౌడ బజార్) నందు నెలకొల్పబడిన శ్రీ కంఠ మహేశ్వర స్వామి సురమాంబ స్వామి వారి దేవాలయం ప్రధమ వార్షికొత్సవం లో పాల్గోని,ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించికమ్మవారి కళ్యాణ మండపం నందుస్వర్ణవెంకట్రామయ్య(లేటు)-సుజాత ఆహ్వానం మేరకు వారి కుమార్తె శిరిష వెడ్స్ వినోద్ ల వివాహ వేడుకకు హాజరై వధువరులను పొంగులేటి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తంబూరి దయాకర్ రెడ్డి తో కలిసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు

# అధికారులు ప్రజానీకానికి అందుబాటులో ఉండాలి

## -ఎమ్మెల్యే మాళోత్ రాందాస్

**వైరా/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ అన్నారు. బుధవారం వైరా మున్సిపాలిటి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే మాళోత్ రాందాస్ మాట్లాడుతూ 20 వార్డులలో ఉన్న ప్రధాన సమస్యలు తక్షణ పరిష్కారం చుపాలని అధికారులకు ఆదేశాలు జరిచేశారు. అనంతరంక్యాంప్ కార్యాలయంలోవైరామున్సిపాలిటి అధికారులతో సమిక్ష సమావేశంనిర్వహించారు,ప్రధానంగా మున్సిపాలిటి లో ఉన్న20 వార్డులలో వేసవి కాలం ద్రుష్ట్యా నిటి ఎద్దడి ,విద్యుత్,శానిటేషన్ సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలని అదికారులను ఆదేశించారు..క్లిన్, గ్రీన్ వైరా గా మున్సిపాలిటిని తీర్చి దిద్దెందుకు ప్రజా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.అధికారులు మున్సిపాలటి ప్రజానికానికి అందుబాటులో ఉండాలి అనిమున్సిపాలిటి అభివృద్ధికి సంబంధించి,ఫ్రధానంగా ఉన్న సమస్యలు తన ద్రుష్టికి తీసుకు రావలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో మున్సిపాలిటి అధికారులు,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు దుర్గాప్రసాద్ కాంగ్రెస్ పార్టీ,శ్రేణులు తదితరులు పాల్గోన్నారు

# రానున్న సంస్థాగత ఎన్నికలకు పరిశీలకులుగా ఎంపికైన కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి




**వరంగల్/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణ రాష్ట్రంలో రానున్న సంస్థాగత ఎన్నికలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు ప్రత్యేక పిసిసి పరిశీలకులుగా వరంగల్ కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి నియాకమాకమైనారు. వారితో పాటు మాసాన్ పల్లి లింగాజీ ని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం నియమించారు. హైదరాబాద్ ఇందిరా భవన్ లో టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన రాష్ట్ర పరిశీలకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథితులుగా ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శులు విశ్వనాథన్, విష్ణు నాథ్, సీడబ్ల్యూసి సభ్యులు వంశీ చంద్ రెడ్డి పాల్గొని ఏఐసిసి ఆదేశాల మేరకు వివిధ జిల్లాకు పరిశీలకులను నియమించినట్లు కుడా చైర్మన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

# విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ నటించిన సోదర చిత్రం

## - భారీ విజయాన్ని సాధించేలా కృషి చేయాలి

## - విశ్వబ్రాహ్మణ సంఘం వరంగల్ జిల్లా నాయకులు రామగిరి అనిల్



వరంగల్/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త): ఈనెల 25వ, తేదీన విడుదల కాబోతున్న సోదర చిత్రం భారీ విజయాన్ని సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని బుధవారం విశ్వబ్రాహ్మణ సంఘం వరంగల్ జిల్లా నాయకులు రామగిరి అనిల్ కోరారు. విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ సినిమా హీరో సంపూర్ణేష్ బాబు నటించిన చిత్రం సక్సెస్ అయ్యేలా తెలుగు రాష్ట్రాలలోని విశ్వబ్రాహ్మణులంతా చూడాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో ఉన్న విశ్వబ్రాహ్మణులు అందరూ విశ్వబ్రాహ్మణ ముద్దుబిడ్డ సంపూర్ణేష్ బాబు సోదర చిత్రం సినిమాను చూసి, ఆదరించాలని సినిమాను ఘనవిజయం సాధించడంలో కీలకపాత్ర పోషించాలని, ప్రతి ఒక్కరిని కోరడం జరిగిందన్నారు. విశ్వబ్రాహ్మణ కులంలో పుట్టి ఈ తరంలో ఉన్న ఏకైక హీరో సంపూర్ణేష్ బాబుకి విశ్వబ్రాహ్మణులందరూ అండగా ఉండాలని అన్నారు. ముందు ముందు చాలా చిత్రాలు నటించాలని, పెద్ద హీరోగా ఆయన ఎదగాలని మనస్ఫూర్తిగా కోరారు.

# రైతుల పాలిట శాపంగా మారిన కోతుల బెడద

## - కుక్కలతో పహారా కాస్తున్న రైతులు..

## కోతుల సమస్య పరిష్కరించాలని రైతుల విన్నపం





**వర్ధన్నపేట/ఏప్రిల్ 23 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని కట్ర్యాల గ్రామంలో కోతుల బెడద రైతుల పాలిట శాపంగా మారింది. కోతుల బారి నుంచి పంటలను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామ శివారులోని డీ ఫ్లోరైడ్ వాటర్ ప్రాజెక్టు నిర్వహణలో లేకపోవడంతో పడవ బడి కోతులకు ఆవాసంగా మారింది. దీంతో కోతులు అక్కడే బసచేస్తూ, చుట్టుపక్కల ఉన్న మామిడి, మొక్కజొన్న, కూరగాయలు పంట చేల మీద పడి ధ్వంసం చేస్తూ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంటలను కాపాడుకునేందుకు స్థానిక రైతులు కుక్కలతో పహారకాస్తు రోజంతా పంట పొలాల వద్ద రాత్రి ప్రజలు తేడా లేకుండా ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పలుమార్లు కోతులు తమపై దాడికి దిగతూ గాయపరుస్తున్నాయని వారు వాపోతున్నారు. అధికారులు స్పందించి తమ గ్రామంలో నెలకొన్న కోతుల సమస్యను పరిష్కరించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

# నర్సంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా ఆంగ్ల భాష దినోత్సవం

## -ప్రిన్సిపాల్ మల్లం నవీన్




**నర్సంపేట/ఏప్రిల్23(జర్నలిస్ట్ వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల నర్సంపేట (అటానమస్)లో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ ఆంగ్లభాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎం.ఎం.కే. రహీముద్దీన్ సమన్వయకర్తగా, ప్రొఫెసర్ మల్లం నవీన్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ఏఎస్ఎం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సుకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని ప్రొఫెసర్ మల్లం నవీన్ మాట్లాడుతూ ఆంగ్ల భాష యొక్క గొప్పతనాన్ని , షేక్స్పియర్ రచనలు ఆంగ్లభాషపై చూపించిన ప్రభావాన్ని తెలియజేస్తూ విద్యార్థులు కూడా అతని యొక్క నవలలను చదివి ఆంగ్లభాషపై మక్కువ పెంచుకోవాలని కోరారు. ప్రొఫెసర్ బి. సుకుమారి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యధిక మంది మాట్లాడుతున్న భాష ఆంగ్లమని, తను కూడా డిగ్రీ స్థాయి నుంచి ఆంగ్లంపై మక్కువ పెంచుకొని డిగ్రీలో సైన్స్ గ్రూప్ అయినప్పటికిని తరువాత ఆంగ్లంపై దృష్టిస్తారించినట్టు తెలియజేస్తూ, ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడాలి అంటే భాష పై పట్టు ఉండాలని ముఖ్యంగా గ్రామీణ పిల్లలు ఇంకా ఎక్కువ కృషి చేయాలని పేర్కొన్నారు. ఆంగ్ల విభాగ అధిపతి ఎమ్.ఎమ్.కే రహీముద్దీన్ మాట్లాడుతూ ఆంగ్లంలో నైపుణ్యం ద్వారా ఉద్యోగ,ఉపాధి అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంచుకొని జీవితంలో స్థిరపడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.బైరి సత్యనారాయణ అకాడమీక్ కోఆర్డినేటర్ డా.కందాల సత్యనారాయణ తెలుగు విభాగం నుండి ఎస్.రజిత, హిందీ విభాగం నుంచి డా. గాయత్రి, స్టాఫ్ సెక్రెటరీ డా.సోమయ్య, డా.రాంబాబు, డా.రాజీరు, డా.భద్రు, డా.సంధ్య, ఆర్.రుద్రాణి, డా.పూర్ణచందర్, గణేష్, రమేష్, గ్లోరీ, మాధవి, నిజాం, శ్రీనివాస్, డా.భార్గవి, డా.లక్ష్మి, డా.దేవేందర్, డా.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రారంభించిన ఏఎంసి చైర్మన్



**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం నల్లబెల్లి గ్రామంలో ఐ.కే.పీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఏఎంసి చైర్మన్ నరకుడు వెంకటయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు, మండల అధ్యక్షులు ఎద్దు సత్య నారాయణ, బ్లాక్ అధ్యక్షులు అబ్బిడి రాజిరెడ్డి, పోశాల వెంకన్న, మార్కెట్ డైరెక్టర్ మల్యాల దేవేందర్, జిల్లా యూత్ నాయకులు బిర్రు రాజు, నల్లబెల్లి కాంగ్రెస్ గ్రామ పార్టీ అధ్యక్షులు తాటికాయాల దిలీప్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ఆదేశానుసారం దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. 2 అతి ముఖ్యమైన పథకాల ద్వారా రైతులకు, పేద ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. అవి సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు 500 వందల రూపాయలు బోనస్, రేషన్ కార్డు లబ్ధిదారులకు ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాలు అన్నారు. 25 లక్షల మంది రైతులకు ఒక ఏడాదిలోనే 21వేల కోట్ల రుణ మాఫీ చేయడం, ఉచిత కరెంట్, రైతు భరోసా, 500 బోనస్ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం చేయని విధంగా తెల్ల రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమని తెలిపారు. అందుకోసమే రాష్ట్రంలో సన్నాలు పండించే రైతులను ప్రోత్సహిస్తుందని అన్నారు. దీనివల్ల రైతుల వద్దనే సన్నాలు కొనుగోలు చేసి మళ్ళీ ప్రజలకు సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందువలన రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే పంటను అమ్మాలని సూచించారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియడం లేదని కావున కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. తేమ 17శాతం ఉండాలని, బస్తా 41 కేజీలు మాత్రమే తూకం వేయాలని తెలిపారు. ఈ విషయంలో రైతులను ఇబ్బంది పెట్టవద్దని స్పష్టం చేశారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించాలని కోరారు. దళారుల వద్దకు వెళ్లి నష్టపోవద్దని సూచించారు. ఇంత గొప్ప ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతీ ఒక్కరి ఆశీస్సులు, దీవెనలు ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జక్కి గోపాల్, యూత్ కాంగ్రెస్ మండల పార్టీ ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం, ఇందిరమ్మ కమిటీ మెంబర్స్ బిర్రు చంద్రయ్య, బిర్రు యాకయ్య, సోమల కుమార్, పురుగుజ కవిత, అంబాల యాకాంత, కాంగ్రెస్ పార్టీ నాయకులు గిరగోని యాదగిరి, బిర్రు భాస్కర్, బిర్రు చందర్, తాటికాయల నాగరాజు, ఏఈఓ శిరీష, ఏపీఎం వేణు, మార్కెట్ పిఆర్పీ భాగ్యలక్ష్మి, సిరివెన్నెల వివో ఇన్చార్జి బిర్రు సరిత, బికే అనిత, కమిటీ సభ్యులు పుశమ్మ, శ్రీలత, వనిత, రాజకుమారి, పావని, శ్రావణి, గ్రామ రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# మంచి ఫలితాలు సాధించిన పిఎం శ్రీ పాఠశాల విద్యార్థులు

## - విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు- ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు సీల్డ్స్ ఆందజేత

## - లాస్ట్ వర్కింగ్ డే సందర్భంగా పాల్గొన్న తల్లిదండ్రులు









**వర్ధన్నపేట/ఏప్రిల్ 23(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పీఎం శ్రీ పాఠశాలలో విద్యార్థులు మంచి ఫలితాలను సాధించారని ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు ఝాన్సీరాణి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని అత్యధిక మార్కులను సాధించిన ప్రోగ్రెస్ రిపోర్ట్స్ తో పాటు సీల్డ్స్ బహుకరించారు. లాస్ట్ వర్కింగ్ డే సందర్భంగా బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు హాజరైనారు. ఈ క్రమంలో 5వ, తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైన సందర్భంగా విద్యార్థులు మరింత ఉత్సాహంగా విద్యను అభ్యసిస్తున్నారని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రస్తుతం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా మెరుగైన విద్యావ్యవస్థను ప్రభుత్వం కల్పిస్తున్నట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు కావలసిన వసతులను కల్పిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యను బోధించే ఉపాధ్యాయులు ప్రతి ఒక్కరూ అనుభవం కలిగిన వారే ఉన్నారని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయ, సహకారాలతో పాఠశాలలు అభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించకుండా ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలకు పంపించి, ఆర్థిక భారాన్ని కొనితెచ్చుకోవద్దన్నారు. నాణ్యమైన ఉచిత విద్య అనుభవం కలిగిన ఉపాధ్యాయుల చేత బోధిస్తుంటే, ప్రైవేటు పాఠశాలలకు పంపించి, ఆర్థిక నష్టాన్ని ఎందుకు భారంగా భరించాలన్నారు. ప్రస్తుతం ప్రైమరీ పాఠశాలలో ఎల్కేజీ, యూకేజీ విద్యను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు చెప్పారు. ప్రతి విద్యార్థి మార్కుల సంఖ్య చూసినట్లయితే ఆశ్చర్య పోవాల్సిందే అన్నారు. ఇలాంటి అవకాశాలను ప్రతీ విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా క్రమశిక్షణతో పాటు శ్రద్ధగా చదువుకుని అధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌తో మనం క్రికెట్ ఆడవద్దు

**ఇప్పుడే కాదు ఇంకెప్పటికీ వద్దు**

**మాజీ క్రికెటర్ శ్రీవాత్సవ్ గోస్వామి**

**పాకిస్థాన్ చర్యలపై మండిపాటు**



జమ్మూకశ్మీర్ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడితో దేశం ఉలిక్కిపడింది. ఉగ్రవాద చర్యపై యావత్ క్రీడా లోకం విచారం వ్యక్తం చేసింది. పలువురు టీమ్ఇండియా క్రికెటర్లు బాధితులకు సంతాపం ప్రకటించారు. ఈ నేపథ్యంలో మాజీ క్రికెటర్ శ్రీవాత్సవ్ గోస్వామి పాకిస్థాన్ చర్యలపై మండిపడ్డాడు. ఇక పాకిస్థానతో భారత్ క్రికెట్ సంబంధాలు తెంచుకోవాలని అన్నాడు. భవిష్యత్‌లో పాక్‌తో టీమ్ఇండియా క్రికెట్ ఆడకూడదని బీసీసీఐకి లేఖ రాశాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ షేర్ చేశాడు. వాళ్లతో క్రికెట్‌కు నో చెప్పండి. పాకిస్థానతో మనం క్రికెట్ ఆడవద్దు. ఇప్పుడే కాదు ఇంకెప్పటికీ వద్దు. పాకిస్థాన ఆతిథ్యమిచ్చిన ఛాంపియన్స్ ట్రోఫీకి టీమ్ఇండియాను అక్కడకి పంపనందుకు కొందరు ఏదో ఏదో మాట్లాడారు. రాజకీయాల కంటే క్రీడలే ఎక్కువ అని అన్నారు. మరి ఇప్పుడు జరిగిందేంటి ఇండియన్స్‌ను చంపడమే వాళ్లకు జాతీయ క్రీడ అయ్యింది. వాళ్లు అలాగే ఆడితే మనం కూడా అదే భాషలో సమాధానం చెప్పాలి. అంతేకానీ బ్యాట్‌లు, బంతులతో కాదు. సంకల్పం, సహనంతో సమాధానం చెప్పాలి"నాకు చాలా కోపంగా ఉంది. ఎంతో బాధపడుతున్నాను. కొన్నినెలల కిందట లెజెండ్స్ లీగ్ ఆడేందుకు నేను కశ్మీర్ వెళ్లాను. పాహల్గామ్‌ను కూడా సందర్శించాను. స్థానికులతో మాట్లాడాను. వాళ్లలో మళ్లీ చిగురించిన ఆశను చూశాను. అక్కడ శాంతి తిరిగివచ్చిందనిపించింది. కానీ ఇప్పుడు మళ్లీ రక్తపాతం. ఇది మనసును కుదిపేస్తుంది. మనవాళ్లు చనిపోతుంటే ఎన్నిసార్లు మానంగా, క్రీడా భావనతో ఉండమంటారారా ఇక చాలు. ఈసారి అలా ఉండదు' అని శ్రీవాత్సవ్ రాసుకొచ్చాడు.అయితే ఇరుదేశాల మధ్య భద్రతా కారణాల వల్ల భారత్- పాక్ మధ్య 2013 నుంచి ద్వైపాక్షిక సిరీస్‌లు లేవు. ఈ దాయాది దేశాలు కేవలం ఐసీసీ టోర్నమెంట్‌ల్లోనే పోటీ పడుతున్నాయి. ఇక టీమ్ఇండియా చివరిసారిగా 2008లో పాకిస్థానలో పర్యటించింది.కాగా, కశ్మీర్ పహల్గామ్ ప్రాతంలోని బైసరనలో మంగళవారం పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో 28మంది టూరిస్టులు మృతి చెందగా, మరో 20 మందికి పైగా గాయపడ్డారు. ఈ దాడిని రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ సహా పలువురు తీవ్రంగా ఖండించారు.

## ఉగ్రదాడిపై స్పందించిన క్రికెటర్లు



జమ్ముకశ్మీర్‌లోని పవాల్గాం ఉగ్రదాడి ఘటనపై భారత్ క్రికెట్ తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనను వ్యతిరేకిస్తూ ఐపీఎల్‌లో 2025 సన్‌రైజర్స్, ముంబయి మధ్య జరిగే 41వ మ్యాచ్‌లో ఉగ్రదాడి ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి బీసీసీఐ నివాళు లర్పించనుంది. ప్లేయర్లు, అంపైర్లు చేతులకు నల్లటి ఆర్మ్‌బ్యాండను కనిపిస్తారు. అలాగే మ్యాచ్‌కు ముందు ఒక నిమిషం మౌనం పాటిస్తారు. మైదానంలో చీర్‌గల్స్ కూడా ఉండరు.

ఇక ఉగ్రదాడిపై భారత క్రికెటర్లు స్పందించారు. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తూ టీమ్ఇండియా కోచ్, ప్రస్తుత, మాజీ క్రికెటర్లు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. " మృతుల కుటుంబాల కోసం ప్రార్థిస్తున్నా. ఘటనకు సంబంధించిన బాధ్యులు మూల్యం చెల్లించుకుంటారు. దీనిపై భారత్ తీవ్రంగా స్పందిస్తుందని టీమ్ఇండియా కోచ్ గౌతమ్ గంభీర్ అన్నారు. కశ్మీర్‌లో అమాయక పర్యటకులపై జరిగిన దాడి దారుణమైమది. ఆ ఘటన తీవ్రంగా బాధించింది. ఇలాంటి దుఃఖ సమయంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు సానుభూతి తెలియజేస్తున్నా. వారి ప్రార్థిస్తున్నాం. పర్యటకులపై ఇటువంటి హింసాత్మక చర్యలకు పాల్పడటం మానవాళికి అవమానకరమని టీమ్ఇండియా మాజీ ప్లేయర్, బీసీసీఐ మాజీ అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ అన్నాడు.

# టాప్ త్రీ స్థానానికి ముంబై

## సన్‌రైజర్స్‌కు మళ్లీ నిరాశే

వరుస విజయాలతో దూసుకుపోతున్న ముంబై ఇండియన్స్ ఖాతాలో మరో విజయం చేరింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (%ూా=ం%)పై ఘన విజయం సాధించింది. పాయింట్ల పట్టికలో ఏకంగా మూడో స్థానానికి చేరుకుంది. వరుస పరాజయాలతో సతమతమవుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ మరో పరాజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో ముంబై ఇండియన్స్ టీమ్‌తో (%ూా=ం జం వీ×%) సన్‌రైజర్స్ తలపడింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్దేశించిన లక్ష్యాన్ని ముంబై సునాయాసంగా ఛేదించింది (%ఖ్రూా% 2025). రోహిత్ శర్మ (46 బంతుల్లో 70) మరో అర్ధశతకం సాధించాడు ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ బ్యాటింగ్‌కు దిగింది. ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెండో ఓవర్లోనే ట్రావిస్ హెడ్ (0) అవుటయ్యాడు. ఆ తర్వాతి ఓవర్లో ఇషాన్ కిషన్ (1) బంతి బ్యాట్‌కు తగిలిందనుకుని తనకు తానుగా మైదానాన్ని వీడి వెళ్లిపోయాడు. అయితే రీప్లేలో బంతి బ్యాట్‌కు తగల్లేదని తేలింది. ఆ తర్వాతి ఓవర్లోనే మరో ఓపెనర్ అభిషేక్ శర్మ (8) పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత నితీష్ కుమార్ రెడ్డి (2) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయాడు. టాపార్డర్‌లో నలుగురు బ్యాటర్లలో ఒక్కరూ కూడా పది పరుగులు చేయలేకపోయారు. టాపార్డర్ విఫలమైనా హెన్రిచ్ క్లాసెన్ (71) అర్ధశతకంతో ఆదుకోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ కోలుకుంది. అతడికి అభినవ్ మనోహర్ (43) సహకరించాడు. వీరిద్దరూ



ఆరో వికెట్‌కు 99 పరుగులు జోడించారు. దీంతో సన్‌రైజర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 143 పరుగులు చేసింది. ముంబై బౌలర్లలో ట్రెంట్ బౌల్ట్ నాలుగు వికెట్లు తీశాడు. దీపక్ ఛాహర్ రెండు వికెట్లు తీశాడు. బుమ్రా, హార్దిక్ పాండ్యా ఒక్కో వికెట్ దక్కించుకున్నారు.సన్‌రైజర్స్ నిర్దేశించిన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ముంబై ఇండియన్స్ ఆరంభంలోనే రికెల్టన్ (11) వికెట్ కోల్పోయింది. అయితే మరో ఓపెనర్ రోహిత్ శర్మ (70) తన ఫామ్‌ను కొనసాగించి అదిరిపోయే అర్ధశతకం సాధించాడు. అతడికి విల్ జాక్స్ (22), సూర్యకుమార్ యాదవ్ (40) సహకరించారు. దీంతో ముంబై 15.4 ఓవర్లలోనే మూడు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది.



## బుమ్రా 300 వికెట్లు.. రోహిత్ శర్మ 12 వేల పరుగులు

హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ఆటగాళ్లు రోహిత్ శర్మ జస్ప్రీత్ బుమ్రాతమ కెరీర్లో అరుదైన మైలు రాళ్లను చేరుకున్నారు. హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో ప్రమాదకర హెన్రిచ్ క్లాసెన్‌ను జస్ప్రీత్ బుమ్రా అవుట్ చేశాడు. ఇది బుమ్రాకు 300వ టీ-20 వికెట్. అంతర్జాతీయ టీ-20 క్రికెట్, ఐపీఎల్‌లో కలిపి ఇప్పటికి బుమ్రా 300 వికెట్లు దక్కించుకున్నాడు (%ఖ్రూా 2025).%ఇదే మ్యాచ్‌లో హిట్ మ్యాన్ రోహిత్ శర్మ కూడా అరుదైన మైలు రాయిని చేరుకున్నాడు. ఈ మ్యాచ్‌లో 12 వేల టీ-20 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. ముంబై ఇన్నింగ్స్ మూడో ఓవర్లో కమిన్స్ బౌలింగ్‌లో వరుసగా సిక్స్, ఫోర్ కొట్టిన రహిత్ ఈ ఘనతను చేరుకున్నాడు. అంతర్జాతీయ టీ-20 క్రికెట్, ఐపీఎల్‌లో కలిపి ఇప్పటికి రోహిత్ 12 వేల పైచిలుకు పరుగులు చేశాడు. తాజా మ్యాచ్‌లో వరుసగా రెండో అర్ధశతకం సాధించిన రోహిత్ ముంబై విజయంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు.



## ఐపీఎల్‌పై తమ నిఘా ఎప్పుడూ ఉంటుంది



### రాజస్థాన్ క్రికెట్ పై ఆరోపణలలో ఎలాంటి నిజం లేదు

### ఫిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ స్పష్టత

ఐపీఎల్‌లో ఫిక్సింగ్ ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. హైదరాబాద్‌కి చెందిన ఓ వ్యాపార వేత్త.. మ్యాచ్ ఫిక్సింగ్ కు పాల్పడేందుకు ప్రయత్నిస్తున్నాడని బీసీసీఐ హెచ్చరించిన కొద్ది రోజుల్లోనే, సొంత జట్టుపై రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ కన్వీనర్ జయదీప్ బిహానీ ఫిక్సింగ్ ఆరోపణలు చేయడం చర్చనీయాంశంగా మారింది. అయితే ఈ ఆరోపణలపై తాజాగా బీసీసీఐ స్పందించింది.ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ కు బ్యాడ్ టైమ్ నడుస్తోంది. ఇప్పటి వరకు 8 మ్యాచులు ఆడగా.. కేవలం రెండు మ్యాచుల్లో మాత్రమే గెలిచింది. పైగా చేతివరకు వచ్చిన విజయాలను కూడా చేజార్చుకుంటోంది. రీసెంట్ గా ఢిల్లీ క్యాపిటల్స్, లక్నో సూపర్ జెయింట్స్ జట్లపై తక్కువ పరుగుల తేడాతో ఓడింది ఆర్ఆర్. ఆఖరి ఓవర్లో కనీస పరుగులు చేయలేక పరాజయం పొందింది. దీంతో రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ కమిటీ కన్వీనియర్ జయదీప్ బిహానీ షాకింగ్ కామెంట్స్ చేశారు.రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఫిక్సింగ్ ఆరోపణలు చేశాడు. చిన్నపిల్లలు కూడా దీన్ని ఫిక్సింగ్ మ్యాచ్ అంటారని వ్యాఖ్యానించాడు. దీనిపై ఉన్నత స్థాయి విచరణ జరపాలంటూ డిమాండ్ చేశాడు. అయితే ఈ ఫిక్సింగ్ ఆరోపణలపై బీసీసీఐ తాజాగా స్పందించింది. ఐపీఎల్‌పై తమ నిఘా ఎప్పుడూ ఉంటుందని, రాజస్థాన్ క్రికెట్ చేసిన ఆరోపణలలో ఎలాంటి నిజం లేదంటూ బీసీసీఐ వర్గాలు స్పష్టత ఇచ్చాయి."రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ లో త్వరలోనే ఎన్నికల జరగబోతున్నాయి. దీని చుట్టూ ఎంతో డ్రామా జరుగుతోంది. ప్రతిఒక్కరికీ అటెన్షన్ కావాలి. ఇప్పటికే బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం 24 గంటల పాటూ ఐపీఎల్‌పై కన్నేసి ఉంచింది. రాజస్థాన్ క్రికెట్ అసోసియేషన్ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదు." అని బీసీసీఐకి చెందిన ఓ అధికారి తెలిపారు. కాగా, ఈ ఐపీఎల్ సీజన్ లో రాజస్థాన్ రాయల్స్ ఆరంభం నుంచే మెరుగైన ప్రదర్శన చేయలేకపోతుంది. దీంతో రాజస్థాన్ మ్యాచ్‌లను వీక్షించే ప్రేక్షకులు తగ్గిపోయారు. సాధారణంగా రాజస్థాన్ మ్యాచ్‌లకు 1800 టికెట్ల కన్నా ఎక్కువగా అమ్ముడుపోయేవి. కానీ ఇప్పుడు వెయ్యి నుంచి 1200 వరకే టికెట్లు అమ్ముడుపోతున్నాయని తెలిసింది.

# బ్రేకుల్లేని బుల్డోజర్.. సాయి సుదర్శన్



కాటేరమ్మ కొడుకులు వస్తుంటారు.. పోతుంటారు.. కానీ ఈ సలారోడు మాత్రం వస్తే పాతుకుపోతాడు. ఫామ్ కోల్పోవడం అన్న మాటుండదు. బరిలోకి దిగితే ప్రత్యర్థులు బెంబేలెత్తిపోవాల్సిందే. మరి మేము ఎవరి గురించి మాట్లాడుతున్నాం అని అనుకుంటున్నారా. అతడు మరెవరో గుజరాత్ ఓపెనర్ సాయి సుదర్శన్. ఐపీఎల్ 2025లో గుజరాత్ వరుస విజయాలు సాధిస్తోందంటే.. దానికి మూలకారణం సాయి సుదర్శన్. ఓపెనర్‌గా దిగి మంచి ఇన్నింగ్స్‌లు ఆడుతూ.. తన జట్టుకు అద్భుత విజయాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాడు ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్. మంగళవారం కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఈ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మరో అర్ధ సెంచరీతో అదరగొట్టాడు. ఇప్పటిదాకా మొత్తం 8 మ్యాచ్‌లు ఆడిన గుజరాత్ 6 మ్యాచ్‌లు గెలిచి.. కేవలం 2 మ్యాచ్‌లు మాత్రమే ఓడిపోయింది. పాయింట్ల పట్టికలో 12 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. 74, 63, 49, 5, 82, 56, 36, 52.. సుదర్శన్ ఈ సీజన్‌లో మొత్తంగా 8 మ్యాచ్‌లు ఆడి.. 417 పరుగులు చేశాడు. ఇందులో 5 అర్ధ సెంచరీలు ఉండగా.. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 82గా ఉంది. అలాగే ఈ ఇన్నింగ్స్‌లలో మొత్తంగా 42 ఫోర్లు, 15 సిక్సర్లు బాదాడు. ఆరెంజ్ క్యాప్‌ను సొంతం చేసుకున్నాడు. మిగిలిన డొమెస్టిక్ ఆటగాళ్ల కంటే సుదర్శన్ మిస్టర్ కన్సిస్టెంట్‌గా ఐపీఎల్‌లో కొనసాగుతున్నాడని మాజీ క్రికెటర్లు ప్రశంసలు కురిపించారు. కచ్చితంగా ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్‌కు బీసీసీఐ సాయి సుదర్శన్‌ను ఎంపిక చేయాలని క్రికెట్ ఫ్యాన్స్ కోరుకుంటున్నారు.



# 796లో కీర్తి సురేష్‌కి చోటు..!

'మహానటి' ఫేం కీర్తి సురేష్ బేబీ జాన్ సినిమాతో హిందీలో ఎంట్రీ ఇచ్చింది. ఆ సినిమా నిరాశ పరిచిన హిందీలో ఆఫర్లను సొంతం చేసుకుంటూనే ఉంది. ప్రస్తుతం ఒక హిందీ వెబ్ సిరీస్‌లో నటిస్తున్న కీర్తి సురేష్ ప్రస్తుతం రెండు హిందీ సినిమాలకు సంబంధించిన చర్చలు జరుగుతున్నాయని తెలుస్తోంది. మరోవైపు తమిళంలోనూ కీర్తి సురేష్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలను చేస్తుంది. ఈ మధ్య కాలంలో కీర్తి సురేష్ తెలుగు సినిమాల్లో ఎక్కువగా కనిపించకపోవడంతో ఆమె అభిమానులు అసంతృప్తితో ఉన్నారు. ఎట్టకేలకు కీర్తి సురేష్ తెలుగు సినిమాలో కనిపించబోతుంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందబోతున్న తెలుగు – తమిళ సినిమాలో కీర్తి సురేష్ హీరోయిన్‌గా ఎంపిక అయిందనే వార్తలు వస్తున్నాయి.వెంకీ అట్లూరి దర్శకత్వంలో గత ఏడాది వచ్చిన లక్కీ భాస్కర్ మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఆర్థిక నేరాలకు సంబంధించిన కథతో ఆ సినిమాను రూపొందించిన వెంకీ అట్లూరి కమర్షియల్ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. దుల్కర్ సల్మాన్ నటించిన ఆ సినిమా తెలుగు, తమిళ్, మలయాళంలో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. హిందీ వర్షన్‌కి ఓటీటీలో మంచి స్పందన దక్కింది. అందుకే వెంకీ అట్లూరి తదుపరి సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. కాస్త గ్యాప్ తీసుకున్న వెంకీ అట్లూరి తదుపరి సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ మొదలు పెట్టాడు. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం తమిళ్ స్టార్ హీరో సూర్యతో వెంకీ సినిమా ఉండబోతుంది.సితార ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో ద్వి భాష చిత్రంగా రూపొందబోతున్న ఈ సినిమాకు '796 సీసీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారని తెలుస్తోంది. అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మారుతి కార్ల కంపెనీ భారతదేశంకు రావడం వెనుక జరిగిన ఒక ఆసక్తికర కథాంశంను ఈ సినిమాతో దర్శకుడు చూపించబోతున్నాడు. 796 సీసీ అనేది మారుతి కారు ఇంజన్ కెపాసిటీని చూపిస్తుందని సమాచారం అందుతోంది. సూర్య గతంలో ఆకాశమే నీ హద్దురా అనే బయోపిక్‌ను చేశాడు. ఆ సినిమాకు మంచి స్పందన దక్కింది.



## ఉగ్రదాడిపై సినీ స్టార్స్ స్పందన

# హృదయ విదారకం..

కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాద దాడితో ఒక్కసారిగా భారత్ ఉలిక్కిపడింది. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ ప్రాంతంలో విహారానికి వచ్చినవారిపై పాశవిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 26 మంది పర్యటకులు ప్రాణాలు కోల్పోగా... మరో 20 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై సినీ సెలబ్రెటీలు సైతం దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఎక్స్ వేదికగా మెగాస్టార్ చిరంజీవి, జూనియర్ ఎన్‌టీఆర్, మంచు విష్ణు స్పందించారు. ఇది భయంకరమైన, హృదయవిదారక ఘటనగా చిరు పేర్కొన్నారు. అలాగే పహల్గాం దాడి బాధితుల గురించి తెలిసి హృదయం ద్రవించిపోయిందని తారక్ అన్నారు. పహల్గాంలో జరిగిన పిరికి దాడి హృదయ విదారకం అని మంచు విష్ణు తెలిపారు.జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో 26 మంది అమాయక పర్యాటకులను బలిగొన్న దారుణమైన దాడి భయంకరమైనది, హృదయ విదారకమైనది. ఇది క్షమించరాని క్రూరమైన చర్య. మరణించిన వారి కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి జరిగిన నష్టాన్ని ఏదీ పూరించలేదు. వారి కోసం నా సంతాపం, ప్రార్థనలు అని చిరంజీవి ట్వీట్ చేశారు. "పహల్గాం దాడి బాధితుల గురించి తెలిసి హృదయం ద్రవించిపోయింది. దాడిలో మృతిచెందిన వారి కుటుంబాలకు భగవంతుడు ధైర్యాన్ని ఇవ్వాలి. శాంతి, న్యాయం కోసం ప్రార్థిస్తున్నా" అని తారక్ రాసుకొచ్చారు. "పహల్గాంలో జరిగిన పిరికి దాడి హృదయ విదారకం. తమవారిని కోల్పోయిన కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి. ఇలాంటి సమయంలో మనం మరింత బలంగా నిలబడాలి. ఈ దుఃఖ సమయంలో ఐక్యంగా, స్ఫూర్తితో ఉండాలి. ఉగ్రవాదం మనల్ని ఎప్పటికీ విభజించలేదు. జై హింద్" అని మంచు విష్ణు ట్వీట్ చేశారు.




# ఓటీటీలోకి అషురెడ్డి సిరీస్...

ప్రస్తుతం ఓటీటీ వేదికలపై విభిన్నమైన కంటెంట్‌తో వెబ్ సిరీస్‌లు, సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. ఈ క్రమంలో, సోషల్ మీడియా ద్వారా మంచి గుర్తింపు తెచ్చుకున్న అషురెడ్డి ప్రధాన పాత్రలో నటించిన తాజా వెబ్ సిరీస్ ఒకటి ఎలాంటి పెద్ద ప్రచార ఆర్భాటం లేకుండా నేరుగా ఓటీటీలో విడుదలైంది. 'ఎవరు ఎప్పుడు ఎక్కడ' పేరుతో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది.పీఎస్ రావు దర్శకత్వంలో రూపొందిన ఈ వెబ్ సిరీస్ ఒక మర్డర్ మిస్టరీ థ్రిల్లర్‌గా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఇందులో అషురెడ్డితో పాటు నటి ధన్య బాలకృష్ణ, నటుడు కౌశల్ మందా, కమెడియన్ ఆటో రాంప్రసాద్ తదితరులు ముఖ్యమైన పాత్రలను పోషించారు. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'హంగామా' యాప్‌లో ఈ సిరీస్‌ను అందుబాటులో ఉంచారు. ఆసక్తికరంగా, తెలుగు వెర్షన్‌తో పాటు హిందీ భాషలో కూడా ఈ సిరీస్ స్ట్రీమింగ్ అవుతుండటం విశేషం.సిరీస్ కథాంశం విషయానికి వస్తే, ఒక ఎమ్మెల్యే వద్ద పీఏగా పనిచేసే వ్యక్తి అనుమానాస్పదంగా మరణిస్తాడు. ఈ హత్య కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్న సమయంలో, కీలకమైన సాక్షులు కూడా ఒక్కొక్కరుగా హత్యకు గురవుతుంటారు. ఈ వరుస హత్యల వెనుక ఓ అమ్మాయి హస్తం ఉందని దర్యాప్తు బృందం అనుమానిస్తుంది. అసలు ఆ హత్యలు చేసింది ఎవరు? దాని వెనుక ఉన్న కారణాలు ఏమిటి? చివరకు ఏం జరిగింది? అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకోవడమే ఈ సిరీస్ కథాంశం. క్రైమ్, మిస్టరీ థ్రిల్లర్లను ఇష్టపడే వారు ఈ సిరీస్‌ను వీక్షించవచ్చు.

# అది గాడ్ గిఫ్ట్ అని భావిస్తాను



నందమూరి కళ్యాణ్ రామ్ ఎమోషనల్ బ్లాక్ బస్టర్ అర్జున్ సన్నాఫ్ వైజయంతి. ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ విజయశాంతి పవర్ ఫుల్ పాత్రలో నటించారు. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వం వహించి ఈ చిత్రాన్ని అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్ బ్యానర్‌లపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించారు. తాజాగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన ఈ మూవీ అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించి సక్సెస్ ఫుల్ గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా విజయశాంతి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ "ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా, తల్లిగా చాలా విరామం తర్వాత ఒక పవర్ ఫుల్ పాత్ర చేయడం జరిగింది. ప్రజలు రాములమ్మని విజయశాంతిని ఎలాంటి పాత్రలో చూడాలని అనుకున్నారో ఈ సినిమాతో అది ఫుల్ ఫిల్ అయ్యింది. ఇప్పుడు యాక్షన్ అనేది ఒకరకంగా నాకు ఛాలెంజ్.కానీ నేను చేశాను. యాక్షన్‌ను అందరూ ప్రశంసిస్తున్నారు. సినిమాలో అందరూ వారి పాత్రలని అద్భుతంగా చేశారు. అందుకే సినిమాకి అద్భుతమైన ఫలితం వచ్చింది. –ఈ సినిమాలో తల్లితండ్రులు కొడుకుల బంధాన్ని బలంగా చూపించడం జరిగింది. ఈ కథని దర్శకుడు పర్ఫెక్ట్‌గా హ్యాండిల్ చేశారు. మంచి సినిమా చేశామనే తృప్తి వందశాతం వుంది. చాలామంది మహిళలు ఫోన్ చేసి సినిమా అద్భుతంగా వుంది, మదర్ అండ్ సన్ ఎమోషన్ కట్టిపడేసిందని చెబుతుంటే చాలా ఆనందంగా అనిపించింది. పరీక్షల వలన కొందరు చూడలేకపోయారని నాకున్న సమాచారం. బుధవారం అందరం వెళ్తామని చెబుతున్నారు. దీంతో ప్రేక్షకాదరణ ఇంకా అద్భుతంగా ఉండబోతోంది. ఈ సినిమా క్లైమాక్స్ విన్నప్పుడు నేను చాలా షాక్ అయ్యాను.

చాలా కొత్తగా ఉందనిపించింది. హీరో అలా చేయడం అనేది ఫస్ట్ టైం వింటున్నాను. అసలు ఫ్యాన్స్, ఆడియన్స్ ఒప్పుకుంటారా అనిపించింది. నిజంగా అది ఒక ప్రయోగం. అది ఆడియన్స్‌కు నచ్చింది. కెరీర్ ప్రారంభం నుంచి నా ట్రాకే సపరేటు. ప్రతిఘటన, నేటి భారతం, కర్తవ్యం, ఒసేయ్ రాములమ్మ, మొండి మొగుడు పెంకి పెళ్ళాం.. ఇలా ఎన్నో వైవిధ్యమైన చిత్రాలు చేశాను. ఇన్ని రకాల పాత్రలు చేయడం నాకు కుదిరింది. ఇది గాడ్ గిఫ్ట్ అని భావిస్తాను.– నా కెరీర్‌లో చిరంజీవి, బాలకృష్ణ, కృష్ణ, శోభన్ బాబు%ూ% ఇలా హీరోలు అందరితో ఫుల్ గ్లామరస్ రూల్స్ చేశాను. ఇటు చంద్రమోహన్ లాంటి హీరోలతో పని చేశాను. దాదాపు 60 మంది హీరోలతో కలిసి పని చేశాను. చాలా ప్రయోగాలు చేశాను. నా ప్రతి సినిమాకి వేరియేషన్ ఉంటుంది. ఒకదానికి ఒకటి పోలిక ఉండదు. ఇదంతా అదృష్టంగా భావిస్తున్నాను. దేవుడు నాకు అలా రాసిచ్చాడు" అని అన్నారు.



# అనుపమని పట్టించుకోరేంటి..?

అందాల అనుపమని టాలీవుడ్ లో పట్టించుకునే వారు కరువయ్యారు. అదేంటి ఎందుకలా అంటే.. కెరీర్ మొదట్లోనే కుర్రాళ్ల హృదయాలను దోచేసిన ఈ ముద్దుగుమ్మ బొద్దుగా ఉంటే ఛాన్స్ లు రావట్లేదని సన్నగా మారింది. అనుపమలోని ఈ మేకోవర్స్ కొంతమంది ఫ్యాన్స్ కి నచ్చినా కొంతమందికి మాత్రం రుచించలేదు. అయినా సరే ఒకసారి ఇష్టపడ్డాక తప్పదు కదా అనుకుంటూ ఆమెని అభిమానిస్తూ వచ్చారు. అదేంటో అందం అభినయం రెండు ఉన్నా కూడా అంపమకి లక్ కలిసి రాలేదు. తెలుగులో సినిమాలు చేసినా కూడా స్టార్ స్టేటస్ అందుకోలేదు.కెరీర్ లో సినిమాలు పడుతున్నా కొద్దీ స్టార్ హీరోలతో నటించే ఛాన్స్ అందుకోవాలి. కానీ అమ్మడి గ్రాఫ్ పడిపోతూ యువ హీరోలతో నటించే పరిస్థితి వచ్చింది. అఫ్కోర్స్ ఆ సినిమాలు కూడా పాపులారిటీ తెచ్చే ఛాన్స్ ఉంటుంది. కానీ అనుపమ మాత్రం ఆశించిన స్థాయిలో క్రేజ్ తెచ్చుకోలేదు. లాస్ట్ ఇయర్ తెలుగులో ఈగల్, టిల్లు స్క్వేర్ సినిమాలు చేసింది అమ్మడు. టిల్లు స్క్వేర్ సూపర్ హిట్ పడినా కూడా అమ్మడికి తర్వాత పెద్దగా ఛాన్స్ లు రాలేదు.ప్రస్తుతం అమ్మడు పరదా సినిమా చేస్తుంది. ఆ సినిమా టీజర్ తో ఆడియన్స్ లో ఆసక్తి కలిగేలా చేశారు. ఇక మరోపక్క కోలీవుడ్ స్టార్ చియాన్ విక్రమ్ తనయుడు ధృవ్ తో బిసన్ అనే సినిమా చేస్తుంది అమ్మడు. లాక్ డౌన్ అనే సినిమా కూడా చేస్తుంది అనుపమ. మలయాళంలో కూడా పెట్ డిటెక్టివ్ సినిమా చేస్తుంది అనుపమ. దానితో పాటు జె.ఎస్.కె ట్రూత్ షల్ ఆల్వేస్ అనే సినిమా చేస్తుంది.తమిళ, మళయాళ భాషల్లో పర్వాలేదు కానీ తెలుగులో మాత్రం అనుపమని పట్టించుకోవట్లేదు. రీసెంట్ గా డ్రాగన్ సినిమాతో తమిళంతో పాటు తెలుగులో కూడా సక్సెస్ అందుకుంది అనుపమ పరమేశ్వరన్. ఐతే టాలీవుడ్ లో అమ్మడికి ఛాన్స్ లు రాకపోవడానికి కారణం ఏంటన్నది తెలియట్లేదు. ఏది ఏమైనా అనుపమ విషయంలో తెలుగు మేకర్స్ ఏం ఆలోచిస్తున్నారు అన్నది తెలియదు కానీ అనుపమ ఫ్యాన్స్ మాత్రం ఆమెను మరిన్ని సినిమాల్లో చూడాలని కోరుతున్నారు. ఈమధ్య ధృవ్ తో ఆమె కిస్సింగ్ ఫోటో ఒకటి వైరల్ కాగా అది సినిమాలోది అంటూ హడావుడి చేసినా అసలు విషయం ఏంటన్నది మాత్రం తెలియలేదు. ఐతే కోలీవుడ్ లో మాత్రం అనుపమ వరుస ఛాన్స్ లతో అదరగొట్టేస్తుంది.

# ధనుష్ కెరీర్‌లో హయ్యెస్ట్ బడ్జెట్ మూవీగా 'కుబేర'

టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న చిత్రాల్లో దర్శకుడు శేఖర్ కమ్ముల డైరెక్ట్ చేస్తున్న 'కుబేర' ఇప్పటికే మంచి బజ్‌ని క్రియేట్ చేసింది. ఈ సినిమాలో ధనుష్, అక్కినేని నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఇక ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ అయిన ప్రమోషనల్ కంటెంట్ ప్రేక్షకుల్లో ఈ సినిమాపై సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. శేఖర్ కమ్ముల తనదైన మార్క్‌తో ఈ సినిమాను కొత్త పంథాలో తెరకెక్కిస్తున్నాడు.ఇక ఈ సినిమా ధనుష్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ బడ్జెట్ చిత్రంగా నిలిచింది. కుబేర చిత్రాన్ని ఏకంగా రూ.130 కోట్ల బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. ఈ సినిమా కోసం ధనుష్ రికార్డు స్థాయిలో రూ.30 కోట్ల రెమ్యునరేషన్ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇది ధనుష్ కెరీర్‌లోనే హయ్యెస్ట్ రెమ్యునరేషన్ అని సినీ సర్కిల్స్ టాక్. ఇక మరో కీలక పాత్రలో నటిస్తున్న అక్కినేని నాగార్జున ఈ సినిమా కోసం రూ.14 కోట్లు తీసుకుంటున్నాడట.అటు అందాల భామ రష్మిక మందన్న ఈ మూవీ కోసం రూ.4 కోట్ల తీసుకుంటుండగా.. సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమా కోసం రూ.3 కోట్ల తీసుకుంటున్నాడట. దీంతో 'కుబేర' సినిమా బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందా అని అందరూ ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాను జూన్ 20న పలు భాషల్లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు.

